# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | సోమవారం-9 - జనవరి 2026 | సంపుటి : 3 | సంచిక : 252 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in







# జిల్లాల రద్దుపై అపోహలకు సీఎం క్లారిటీ

- జిల్లాల రద్దు, సింగరేణి మెడికల్ బోర్డు రద్దు ఆలోచనలే లేవు
- జిల్లాల పునర్వ్యవస్థీకరణపై స్పష్టత
- సింగరేణి కార్మికుల ప్రయోజనాలకు భరోసా
- భూపాలపల్లి అభివృద్ధిపై దృఢ సంకల్పం

2లో



## మలేసియాలో త్వరలో యూపీఐ సేవలు

- ప్రధాని మోదీ
- భారతీయులకు డిజిటల్ లావాదేవీల్లో సౌలభ్యం
- క్యూఆర్ కోడ్, మొబైల్ నెంబర్ ద్వారా చెల్లింపులు
- భారత్–మలేసియా ఒప్పందాలతో సంబంధాలకు బలం

**కౌలాలంపూర్, ఫిబ్రవరి 8 (తెలంగాణ ముచ్చట్లు):**

భారత్‌లో విస్తృతంగా వినియోగంలో ఉన్న యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ సేవలు త్వరలో మలేసియాలో కూడా అందుబాటులోకి రానున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. మలేసియా పర్యటనలో భాగంగా ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. యూపీఐ సేవల ప్రారంభం మలేసియాలో నివసిస్తున్న భారతీయులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. మలేసియాలో యూపీఐ సేవలు ప్రారంభమైన తర్వాత వర్చువల్ పేమెంట్ అడ్రస్, క్యూఆర్ కోడ్ లేదా మొబైల్ నెంబర్ ద్వారా డిజిటల్ చెల్లింపులు చేయవచ్చని ప్రధాని వివరించారు.

మిగతా 2లో



## సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ నేత కేటీఆర్ తీవ్ర విమర్శలు

- బూతులు మాట్లాడటం తప్ప అభివృద్ధిపై దృష్టి లేదని ఆరోపణ
- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించాలని ప్రజలకు పిలుపు

**తాండూరు, ఫిబ్రవరి 08 (తెలంగాణ ముచ్చట్లు)**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తాండూరు పట్టణంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయన, రేవంత్ రెడ్డి పాలనను ఉద్దేశించి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. చరిత్రలోనే ఇంత చెత్తగా వ్యవహరించిన ముఖ్యమంత్రి మరొకరు లేరని కేటీఆర్ ఆరోపించారు.

ఏ ముఖ్యమంత్రి అయినా పర్యటనలకు వెళ్తే అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై మాట్లాడతారని, కానీ రేవంత్ రెడ్డి మాత్రం బూతులు మాట్లాడటమే తన రాజకీయ ఆయుధంగా మార్చుకున్నారని కేటీఆర్ విమర్శించారు. గత రెండేళ్లుగా మాజీ సీఎం కేసీఆర్‌ను తిట్టడమే తప్ప, రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి పెట్టలేదని దుయ్యబట్టారు.

మిగతా 2లో

## బీఆర్ఎస్ పదేళ్ల పాలనకు ఓట్లేయాలా?



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రశ్న

- ఇందిరమ్మ ఇళ్లతో పేదలకు కాంగ్రెస్ భరోసా
- రేషన్, సంక్షేమ పథకాల అమలుపై స్పష్టత
- వైరా–మధిరలో ఎన్నికల ప్రచార రోడ్ షో

2లో

## యూరియాపై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శ



- యూరియా పేరుతో రైతుల రెచ్చగొట్టే ప్రయత్నం
- క్యూ లైన్ల ప్రచారం పూర్తిగా అసత్యం
- బీఆర్ఎస్ పాలనలో రైతుల కష్టాలు గుర్తుచేసిన మంత్రి
- 'వరి వేస్తే ఉరి' వ్యాఖ్యలపై నైతిక ప్రశ్న
- యూరియా యాప్‌తో సరఫరాలో పారదర్శకత

**హైదరాబాద్, ఫిబ్రవరి 08 (తెలంగాణ ముచ్చట్లు)**

యూరియా విషయంలో బీఆర్ఎస్ పార్టీ రాజకీయ లబ్ధి కోసం రైతాంగాన్ని రెచ్చగొట్టే దిగజారుడు ప్రచారం చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. రైతులు యూరియా కోసం క్యూ లైన్లలో నిలబడుతున్నారని బీఆర్ఎస్ పదే పదే చేస్తున్న ప్రచారం పూర్తిగా అసత్యమని స్పష్టం చేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రైతులను ఏ విధంగా ఇబ్బందులకు గురిచేశారో రాష్ట్ర

మిగతా 2లో



## సిద్దిపేట జిల్లాలో పెద్దపులి కలకలం.. వరుసగా పశువులపై దాడులు!

**సిద్దిపేట, ఫిబ్రవరి 08 (తెలంగాణ ముచ్చట్లు)**

తెలంగాణలోని సిద్దిపేట జిల్లాలో పెద్ద పులి సంచరించడం వల్ల గ్రామాల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. వరుసగా పశువులపై దాడి చేస్తూ దూడలను చంపేస్తుండటంతో రైతులు, గ్రామస్తులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ పులిని పట్టుకునేందుకు అటవీ శాఖ అధికారులు తమ ఆపరేషన్‌ను ముమ్మరం చేశారు.

తాజాగా కొహెడ మండలం ఆరెపల్లి గ్రామ పరిసరాల్లో పులి సంచరించినట్లు రైతులు గుర్తించారు. సమీపంలోని చంద్రానాయక్ తండాలో మాలోత్ రమేష్‌కు చెందిన ఐదు దూడలను పులి చంపేసినట్లు సమాచారం. ఘటనకు సంబంధించి అటవీ, పోలీస్ శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పులి పాదముద్రలను సేకరించారు. పులి సంచరిస్తున్న ప్రాంతాల్లో కెమెరా ట్రాప్‌లను ఏర్పాటు చేసి కదలికలను గమనిస్తున్నారు. ఈ పులి మహారాష్ట్ర నుంచి అటవీ మార్గాల ద్వారా తెలంగాణలోకి ప్రవేశించి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పొలాలకు ఒంటరిగా వెళ్లకూడదని హెచ్చరించారు. రైతులు తమ పశువులను రాత్రి వేళల్లో ఇళ్ల సమీపంలోనే కట్టేసుకోవాలని సూచించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పులిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపినట్లు అధికారులు తెలిపారు

## నాంపల్లి ఫోరెన్సిక్ ల్యాబ్‌లో అగ్నిప్రమాదం..

### కీలక విషయాలు వెల్లడించిన శిఖా గోయెల్!

- ఓటుకు నోటు కేసు ఆధారాలు కాలిపోయాయన్న ప్రచారంపై క్లారిటీ
- ఉదయం మంటలు.. మధ్యాహ్నానికి అదుపు.. నష్టాలపై అంచనా
- కోర్టుకు ఇప్పటికే ఆధారాలు.. అసత్య ప్రచారాలపై ఎఫ్ఎస్ఎల్ ఆగ్రహం




**హైదరాబాద్, ఫిబ్రవరి 08 (తెలంగాణ ముచ్చట్లు)**

హైదరాబాద్ నాంపల్లిలోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో శనివారం ఉదయం జరిగిన అగ్నిప్రమాదంపై ఎఫ్ఎస్ఎల్ డైరెక్టర్ శిఖా గోయెల్ కీలక విషయాలు వెల్లడించారు. ఈ ప్రమాదంలో ఓటుకు నోటు కేసుకు సంబంధించిన కీలక ఆధారాలు కాలిపోయాయంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఆమె ఖండించారు. రెండు ముఖ్యమైన కేసులకు సంబంధించిన ఆధారాలు అగ్నిప్రమాదంలో దగ్ధమయ్యాయన్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. ఆయా కేసులకు సంబంధించిన సాక్ష్యాలు, నమూనాలను గతంలోనే న్యాయస్థానాలకు అప్పగించినట్లు తెలిపారు.

మిగతా 2లో

## అన్నం పెట్టినోళ్లకు ఓటేద్దామా.. సున్నం పూసినోళ్లకు ఓటేద్దామా..



- సదాశివపేట ఓటర్లతో హరీశ్‌రావు
- కాంగ్రెస్ పాలనపై ఘాటు విమర్శలు
- కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధి గుర్తుచేసిన హరీశ్‌రావు

**సదాశివపేట, ఫిబ్రవరి 08 (తెలంగాణ ముచ్చట్లు)**

మెదక్ జిల్లా సదాశివపేటలో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "అన్నం పెట్టినోళ్లకు ఓటేద్దామా.. సున్నం పూసినోళ్లకు ఓటేద్దామా?" అంటూ ప్రజలను ప్రశ్నించారు. రెండున్నరేళ్ల పాలనలో రేవంత్ ప్రభుత్వం ప్రజలకు చేసింది ఏమీలేదని విమర్శించారు.

భార్యకు బస్సు ఫ్రీ ఇచ్చి, భర్తకు డబుల్ టికెట్ ఇచ్చినట్టుగా ప్రజలను మోసం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. రూ.4 వేల పెన్షన్లు ఇవ్వలేదని, ఒక్కొక్కరికీ రూ.52 వేల వరకు బకాయిలు ఉన్నాయని ఆరోపించారు. "అవ్వాతాతలు మీకు రావాల్సిన బకాయి రూ.52 వేలు అడగండి" అంటూ ప్రజలకు పిలుపునిచ్చారు.

కేసీఆర్ హయాంలో సదాశివపేట, సంగారెడ్డిలో ఆస్పత్రులు, కొత్త బస్టాండ్, తాగునీటి

మిగతా 2లో

సోమవారం- 9 - ఫిబ్రవరి 2026

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU

ఎడిటర్: బొల్లిపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# జిల్లాల రద్దుపై అపోహలకు సీఎం క్లారిటీ

**జయశంకర్ భూపాలపల్లి, ఫిబ్రవరి 8 (తెలంగాణ ముచ్చట్లు):**



కొన్ని జిల్లాలను రద్దు చేస్తారని, సింగరేణి మెడికల్ బోర్డును రద్దు చేస్తారంటూ జరుగుతున్న తప్పుడు ప్రచారాలపై ముఖ్య మంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్వయంగా స్పష్టతనిచ్చారు. ఏ జిల్లాను తొలగించే ఆలోచనగానీ, కొత్త జిల్లాలను ఏర్పాటు చేసే యోచనగానీ ప్రభుత్వ పరిశీలనలో లేదని తేల్చిచెప్పారు. సింగరేణి మెడికల్ బోర్డు రద్దుపై జరుగుతున్నది పూర్తిగా తప్పుడు, విష ప్రచారమని పేర్కొన్నారు.

'ప్రజా పాలన - ప్రగతి బాట' కార్యక్రమంలో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా చెల్పూరు గ్రామంలో జరిగిన బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు. "జిల్లాల విషయంలో ఎలాంటి మార్పులు చేయాలన్నా బహిరంగంగా ప్రజలకు తెలియజేసి, శాసనసభలో చర్చించి, ప్రతిపక్షాల సూచనలు తీసుకున్న తర్వాతే నిర్ణయాలు తీసుకుంటాం. కానీ ప్రస్తుతం జిల్లాల రద్దు లేదా కొత్త జిల్లాల ఏర్పాటు ప్రభుత్వ ఆలోచనలోనే లేదు" అని స్పష్టం చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాను రద్దు చేస్తారంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. సింగరేణి మెడికల్ బోర్డు అంశంపై సీఎం మరింత స్పష్టత ఇచ్చారు. ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు సింగరేణి పరీవాహక ప్రాంతంలో వేలాది కార్మిక కుటుంబాలు ఉన్నాయని గుర్తు చేశారు. కార్పొరేట్ మెడికల్ బోర్డును రద్దు చేస్తారని, వారసత్వ ఉద్యోగాలు పోతాయని కొందరు అపోహలు సృష్టిస్తున్నారని పేర్కొంటూ, అలాంటి ఆలోచనలే ప్రభుత్వానికి లేవని తేల్చారు. కార్మికుల ప్రయోజనాలకే ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారికి నష్టం కలిగించే నిర్ణయాలు ఎప్పటికీ తీసుకోబోమని భరోసా ఇచ్చారు.

భూపాలపల్లి ప్రాంత అభివృద్ధిపై సీఎం దృఢ సంకల్పాన్ని వ్యక్తం చేశారు. కుట్రలు, తప్పుడు ప్రచారాలను ప్రజలు గుర్తించగల చైతన్యం ఈ ప్రాంతానికి ఉందని అన్నారు. భూపాలపల్లిని అభివృద్ధి పథంలో నడిపిస్తామని స్పష్టం చేశారు. అలాగే 2027లో జరగనున్న పుష్కరాల సందర్భంగా గోదావరి పరీవాహక ప్రాంతంలోని బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాలను పర్యాటక పుణ్యక్షేత్రాలుగా అభివృద్ధి చేస్తామని, అటవీ ప్రాంతాల్లో రిసార్టులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మున్సిపాలిటీల అభివృద్ధికి 6,116 కోట్ల రూపాయలు కేటాయించినట్లు సీఎం వెల్లడించారు. తెలంగాణ తొలి, మలి విడత ఉద్యమాల్లో వరంగల్ జిల్లా ప్రజలు, కాకతీయ-ఉస్మానియా విశ్వవిద్యాలయాల పాత్రను గుర్తు చేశారు. ఈ సభలో 'సమ్మక్క-సారలమ్మ జిల్లా మహిళా సమాఖ్య'కు 205 కోట్ల రూపాయల బ్యాంకు లింకేజీ చెక్కును ముఖ్యమంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మలేసియాలో త్వరలో యూపీఐ సేవలు



బ్యాంక్ ఖాతాలతో నేరుగా పని లేకుండానే ఈ సేవలను వినియోగించుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. టూ ఫ్యాక్టర్ ఆథెంటికేషన్ ద్వారా లావాదేవీలకు పూర్తి భద్రత కల్పిస్తామని స్పష్టం చేశారు. అయితే ఈ సేవలు ఎప్పటి నుంచి అమల్లోకి వస్తాయనే అంశంపై తేదీని ప్రకటించలేదు. భారత్‌లో యూపీఐ సేవలు వేగంగా విస్తరిస్తున్నాయని ప్రధాని మోదీ గుర్తు చేశారు. గత ఏడాది యూపీఐ ద్వారా సుమారు ఆరు వందల నలభై మిలియన్ల లావాదేవీలు జరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా ఉపయోగిస్తున్న వీసా కార్డ్ సేవల కంటే కూడా యూపీఐ వినియోగం ఎక్కువగా ఉందని, అంతర్జాతీయ డిజిటల్ లావాదేవీల్లో సగానికి పైగా భారత్‌లోనే జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, రెండు రోజుల మలేసియా పర్యటనలో భాగంగా భారత్, మలేసియా మధ్య రక్షణ, వ్యాపారం, సహకారం, సెమీ కండక్టర్ల సరఫరా వంటి కీలక రంగాల్లో పలు ఒప్పందాలు కుదిరాయి. ఈ పర్యటనతో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతం అవుతున్నాయని దౌత్య వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



# బీఆర్ఎస్ పదేళ్ల పాలనకు ఓట్లేయాలా?

**హైదరాబాద్ , ఫిబ్రవరి 08 (తెలంగాణ ముచ్చట్లు)**

'మున్సిపల్ ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలని బీఆర్ఎస్ నాయకులు అడుగుతున్నారు.. పదేళ్ల పాటు రాష్ట్రాన్ని దోచుకున్నందుకు వారికి ఓట్లేయాలా. రూ.8 లక్షల కోట్ల అప్పుల్లో రాష్ట్రాన్ని ముంచినందుకు ఓట్లేయాలా'అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రశ్నించారు. ఖమ్మం జిల్లా వైరా, మధిర మున్సిపాలిటీల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో భట్టి మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేళ్ల పాలన కాలంలో పేదలకు ఒక్క ఇల్లు కానీ, ఇంటి స్థలం కానీ ఇవ్వలేదని ఆరోపించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా.. మళ్లీ ఇప్పుడు తాము వచ్చాకే మొదటి దశలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి రూ.22,500 కోట్ల నిధులు వె చ్చిస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో పేదలు రేషన్ కార్డుల కోసం తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరిగితే పట్టించుకోలేదన్నారు. అప్పుడు ఇచ్చిన దొడ్డు బియ్యం పేదలకు ఉపయోగపడలేదని చెప్పారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలోని 1.05 కోట్ల కుటుంబాలకు గాను 1.02 కోట్ల కుటుంబాలకు సన్న బియ్యం అందిస్తున్నామని తెలిపారు.

అంతేకాక ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంపు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వడంతో పాటు మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేలా రూ.27 వేల కోట్ల వడ్డీలేని రుణాలు పంపిణీ చేశామని వెల్లడించారు. ఈ కార్యక్రమాల్లో వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, రాష్ట్ర హస్తకళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యం, డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ తదితరులు

# యూరియాపై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

రైతాంగానికి బాగా తెలుసని, తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత రెండు సంవత్సరాల్లో వ్యవసాయ రంగానికి ఎంత ప్రాధాన్యత ఇస్తున్నదీ కూడా రైతులు గమనిస్తున్నారని మంత్రి తెలిపారు.

సిద్దిపేట, గజ్వేల్ ప్రాంతాల్లో యూరియా కోసం క్యూ లైన్లలో రైతులు నిలబడి ఇబ్బందులు పడిన ఘటనలు, క్యూ లైన్లలో రైతులు మరణించిన దుర్ఘటనలు కూడా బీఆర్ఎస్ నేతలు మర్చిపోయారని విమర్శించారు. వరి బోనస్ గురించి మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్ నేతలకు ఉందా అని ప్రశ్నిస్తూ, 'వరి వేస్తే ఉరి'అన్న మాటలు గుర్తు చేశారు. గత వానాకాలంలో కేంద్రం నుంచి సకాలంలో ఎరువులు అందక రైతులు ఇబ్బంది పడితే, ఆ పరిస్థితిని రాజకీయ లబ్ధికి వాడుకున్నారని, అయినప్పటికీ పంచాయతీ ఎన్నికల్లో రైతులు బీఆర్ఎస్‌కు తగిన గుణపాఠం చెప్పారన్నారు. పత్తి రైతుల కోసం కేంద్రం తీసుకొచ్చిన 'కపాస్ కిసాన్ యాప్'విజయవంతమవడంతో అదే తరహాలో యూరియా యాప్‌ను అమలు చేస్తున్నామని తెలిపారు. యాప్ అమలులో ఉన్న జిల్లాల రైతులను అడిగి తెలుసుకోవాలని, అక్కడ ఎలాంటి ఇబ్బందులు లేవని తుమ్మల స్పష్టం చేశారు.



# నాంపల్లి ఫోరెన్సిక్ ల్యాబ్‌లో అగ్నిప్రమాదం..

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యంగా 2015లో నమోదైన ఏసీబీ కేసు విషయంలో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అసత్యమని మండిపడ్డారు.

శనివారం ఉదయం 10.08 గంటల సమయంలో నాంపల్లి ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగినట్లు శిఖా గోయెల్ తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని దాదాపు మధ్యాహ్నం 13.30 గంటల వరకు మంటలను ఆర్పినట్లు చెప్పారు. ప్రమాదం కారణంగా ల్యాబ్‌తో పాటు శిక్షణా హాల్, గ్రంథాలయం, మానవ వనరుల విభాగానికి చెందిన గదులు కూడా దెబ్బతిన్నట్లు వివరించారు. ఈ ఘటనపై వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు, అగ్నిప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. జరిగిన ఆస్తి నష్టంపై అధికారులు అంచనాలు రూపొందిస్తున్నారని, పూర్తి వివరాలు వచ్చిన తర్వాత ప్రజలకు వెల్లడిస్తామని చెప్పారు.



ఎఫ్ఎస్ఎల్‌లో జరిగిన అగ్నిప్రమాదంపై కొందరు కావాలనే అసత్య ప్రచారం చేస్తున్నారని శిఖా గోయెల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు కీలక కేసుల్లోని ఆధారాలు కాలిపోయాయన్న వార్తలు పూర్తిగా తప్పుడు సమాచారమని స్పష్టం చేశారు. పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుకు సంబంధించిన ఆధారాలు కూడా ఇప్పటికే కోర్టుకు సమర్పించినట్లు తెలిపారు. 2024 వరకు సేకరించిన పదహారు ఆధారాల్లో ఏడు మినహా మిగతావన్నీ న్యాయస్థానాలకు అప్పగించామని పేర్కొన్నారు. ఫోరెన్సిక్ ల్యాబ్‌లో భద్రతా ప్రమాణాలు కఠినంగా పాటిస్తామని, అన్ని నమూనాలు, పరికరాలను అత్యంత సురక్షితంగా నిల్వ ఉంచుతామని తెలిపారు. ఏదైనా అనుకోని ఘటన జరిగితే, తమ బృందం అవసరమైన సమాచారాన్ని తిరిగి సేకరించి పునరుద్ధరించే సామర్థ్యం కలిగి ఉందని ఆమె వివరించారు.

# సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ నేత కేటీఆర్ తీవ్ర విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి ఈ తరహా భాష వాడటం దురదృష్టకరమని అన్నారు.

తాండూరులో నర్సింగ్ కాలేజీ అంశాన్ని ప్రస్తావిస్తూ, ఆ కాలేజీని తీసుకెళ్లిన దొంగగా రేవంత్ రెడ్డి వ్యవహరించారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు.

రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలను కేటీఆర్ కోరారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించకపోతే రాబోయే మూడేళ్ల పాటు ఆ పార్టీ నేతలు ప్రజలకు అందుబాటులో ఉండరని హెచ్చరించారు. ప్రజల శ్రేయస్సు కోసం బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు.



# అన్నం పెట్టినోళ్లకు ఓటేద్దామా.. సున్నం పూసినోళ్లకు ఓటేద్దామా..



(మొదటి పేజీ తరువాయి)


సమస్యల పరిష్కారం వంటి అభివృద్ధి పనులు జరిగాయని గుర్తుచేశారు. బిడ్డ పుడితే కేసీఆర్ కిట్ ద్వారా ఆర్థిక సాయం, కల్యాణలక్ష్మి కింద ఆడబిడ్డల పెళ్లికి ఆర్థిక మద్దతు ఇచ్చామని తెలిపారు. రేవంత్ రెడ్డి "తులం బంగారం ఇస్తా" అన్న మాట అమలు చేశారా? ఒక్కరికైనా అందిందా? అని ప్రశ్నించారు.

గొర్రె పిల్లల పథకం, చేప పిల్లల పథకం, కేసీఆర్ కిట్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిందని విమర్శించారు. మున్సిపాలిటీలకు నిధులు ఇచ్చి బస్తీ దవాఖానాలు, వీధిలైట్లు, రోడ్లు, పార్కులు ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన ప్రభుత్వానికి ఓట్లేసి గోస పడాలా? అని ప్రశ్నించారు.

బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే సదాశివపేటకు స్పెషల్ ప్యాకేజీ తీసుకొచ్చి అభివృద్ధి చేస్తామని హరీశ్‌రావు హామీ ఇచ్చారు. చెత్త మాటలు వద్దు.. అభివృద్ధి కావాలంటూ ఓటుతోనే సమాధానం చెప్పాలని కోరారు. బీఆర్ఎస్ అభ్యర్థులందరినీ గెలిపించాలని, ప్రజల సమస్యలన్నింటినీ పరిష్కరించే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు.

# సంస్కృతి–సంప్రదాయాల కాపాడే శక్తి మహిళే

**గీతాంజలి పాఠశాలలో అవగాహన పోటీలు**

**సత్తుపల్లి, ఫిబ్రవరి 8 (తెలంగాణ ముచ్చట్లు):** కుటుంబానికి పునాదిగా, సమాజానికి దిశానిర్దేశక శక్తిగా నిలిచే భారతీయ మహిళ పట్ల నేటి సమాజంలో అవగాహనతో కూడిన గౌరవం పెరుగుతోందని శ్రీ రామకృష్ణ పరమహంస-వివేకానంద సేవా సమితి నిర్వాహకులు చీకటి శ్రీనివాసరావు అన్నారు. "భారతీయ మహిళ - ప్రాధాన్యత" అనే అంశంపై ఆదివారం స్థానిక గీతాంజలి పాఠశాలలో నియోజకవర్గ స్థాయిలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని మహిళల పాత్రపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, సమాజ నిర్మాణంలో మహిళ పాత్ర అనివార్యమని పేర్కొన్నారు. ఒక మహిళకు విద్యనందిస్తే ఒక కుటుంబం మాత్రమే కాకుండా ఒక సమాజం అభివృద్ధి చెందుతుందని, విద్యారంగంలో మహిళల భాగస్వామ్యం మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు. విశ్వశాంతి విద్యాలయం ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు, టాలెంట్ స్కూల్ ప్రిన్సిపల్ పులి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ, కష్టసమయాల్లో కుటుంబాన్ని ధైర్యంగా ముందుకు నడిపించే శక్తి మహిళలకే ఉందన్నారు. మహిళలకు సమాన అవకాశాలు లభించినప్పుడే సమాజం సమతుల్యంగా ఎదుగుతుందని, భారతీయ సంస్కృతి-సంప్రదాయాలను తరతరాలకు అందించే ప్రధాన బాధ్యత మహిళలదేనని వారు స్పష్టం చేశారు.

# ఛాతీ నొప్పితో యువకుడి మృతి

- ఈసీఐఎల్‌లోని తులసి ఆసుపత్రిలో మృతిగా నిర్ధారణ



**కుషాయిగూడ, ఫిబ్రవరి 08 (తెలంగాణ ముచ్చట్లు):** కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని మీర్పేట్ హెచ్‌బి కాలనీకి చెందిన ఓ యువకుడు ఛాతీ నొప్పితో అకస్మాత్తుగా మృతి చెందిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది.కుషాయిగూడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాళియాసగిరి, హెచ్‌బి కాలనీ నివాసి కాంత్రి సత్యం (50), వృత్తి డ్రైవర్, తన పెద్ద కుమారుడు కాంత్రి క్రాంతి కుమార్ (27) మృతి చెందినట్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. క్రాంతి కుమార్ రాణిగంజ్‌లోని ఓ ప్రైవేట్ షాపులో ఉద్యోగం చేస్తున్నాడు.ఫిబ్రవరి 07న ఉదయం విధులకు వెళ్లిన క్రాంతి కుమార్, అదే రోజు మధ్యాహ్నం సుమారు 2:40 గంటలకు తన తమ్ముడు కళ్యాణ్‌కు ఫోన్ చేసి ఛాతీ నొప్పిగా ఉందని, ఇంటికి రావడానికి ఆటో బుక్ చేసుకున్నట్లు తెలిపాడు. సమాచారం అందుకున్న కళ్యాణ్ తల్లి చాణిక్యతో కలిసి హెచ్‌బి కాలనీ ఫస్ట్ ఫేజ్ వద్ద బుక్ చేసిన ఆటోను చేరుకున్నారు.క్రాంతి కుమార్‌ను ఆటోలోనే ఈసీఐఎల్‌లోని తులసి ఆసుపత్రికి తీసుకెళ్లే క్రమంలో అతడు స్పృహ కోల్పోయి కుప్పకూలిపోయాడు. ఆసుపత్రికి చేరుకున్న అనంతరం వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు .ఈ ఘటనలో ఎవరిపైనా ఎలాంటి అనుమానం లేదని కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. ఛాతీ నొప్పి కారణంగానే మృతి జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొనగా, పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం పరీక్ష (పిఎంఈ) కోసం పంపించారు.



# రేణుక ఎల్లమ్మ కల్యాణానికి హాజరైన కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్, ఫిబ్రవరి 08 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ న్యూ భరత్ నగర్‌లో చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రేణుక ఎల్లమ్మ అమ్మవారి కల్యాణ మహోత్సవానికి వినాయక్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి హాజరయ్యారు.ఆదివారం రోజు రేణుక ఎల్లమ్మ కల్యాణం భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి కాలనీ వాసులతో కలిసి కల్యాణ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులను ఆశీర్వదిస్తూ, ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో శాంతి, ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సల్ల ప్రభాకర్ రెడ్డి, కృష్ణ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, హనుమంత్, బాబీ, రామకృష్ణ, సురేష్, కిరణ్, రాజు, బుచ్చి రెడ్డి తదితరులు పాల్గొనగా, పెద్ద సంఖ్యలో కాలనీ వాసులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన వార్డు మెంబర్ జంగం పద్మ శివ

**పెద్దమందడి,ఫిబ్రవరి8(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడికి చెందిన సింగిరెడ్డి చిట్టెమ్మ (అంగన్వాడి టీచర్) అకస్మాత్తుగా గుండెపోటుతో మృతి చెందడంతో వారి కుటుంబం తీవ్ర విషాదంలో మునిగింది. ఈ విషయం తెలుసుకున్న 8వ వార్డు మెంబర్ జంగం పద్మ శివ వెంటనే మృతురాలి నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ సందర్భంగా చిట్టెమ్మ కుటుంబ సభ్యులను ధైర్యం చెబుతూ, వారి తక్షణ అవసరాల నిమిత్తం రూ.2,000/ రూపాయల నగదు రూపంలో ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కష్ట సమయంలో తమ కుటుంబానికి అండగా నిలిచిన జంగం పద్మ శివ కు చిట్టెమ్మ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.




## కాంట్రాక్టర్ నిర్లక్ష్యం..



# పసిపిల్లల ఆరోగ్యంపై ముప్పు!

- గ్రీన్ మ్యాట్ ఏర్పాటు లేక ధూళి ప్రభావం
- మమ్మల్ని కాపాడండి అంటూ పసిపిల్లల ఆర్తనాదం

**సత్తుపల్లి, ఫిబ్రవరి 8 (తెలంగాణ ముచ్చట్లు):** స్థానిక పట్టణంలో ప్రభుత్వ హాస్పిటల్‌లో కొనసాగుతున్న ప్రభుత్వ భవనాల నిర్మాణ పనుల కారణంగా పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హాస్పిటల్ పక్కనే ఉన్న గాంధీనగర్ రోడ్ నంబర్-12లో నివసించే పసిపిల్లలు నిర్మాణ పనుల నుంచి వెలువడుతున్న అధిక ధూళి కారణంగా ఆరోగ్య సమస్యల బారిన పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ ప్రాంతంలో ధూళి నియంత్రణకు అవసరమైన గ్రీన్ మ్యాట్ ఏర్పాటు చేయకపోవడంతో పాటు, నీటితో చల్లే చర్యలు చేపట్టకపోవడం వల్ల చిన్నారులకు దగ్గు, జలుబు, శ్వాస సంబంధిత సమస్యలు పెరుగుతున్నాయని తెలిపారు. దీంతో తల్లిదండ్రులు పిల్లలను చికిత్స కోసం ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సి వస్తూ ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

ఈ విషయమై నిర్మాణ పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో నిర్లక్ష్య ధోరణి కొనసాగుతోందని ఆరోపించారు. సమస్యను సత్తుపల్లి శాసనసభ్యురాలు మట్టా రాగమయి దయానంద్ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు.

ప్రభుత్వం తక్షణమే స్పందించి నిర్మాణ ప్రాంతంలో గ్రీన్ మ్యాట్ ఏర్పాటు, నీటితో చల్లడం వంటి ధూళి నియంత్రణ చర్యలు చేపట్టి ప్రభుత్వ హాస్పిటల్ పరిసరాల్లో నివసిస్తున్న పసిపిల్లలను ఆరోగ్య సమస్యల నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

# సంస్కృతి–సంప్రదాయాల కాపాడే శక్తి మహిళే

- గీతాంజలి పాఠశాలలో అవగాహన పోటీలు.




**సత్తుపల్లి, ఫిబ్రవరి 8 (తెలంగాణ ముచ్చట్లు):** కుటుంబానికి పునాదిగా, సమాజానికి దిశానిర్దేశక శక్తిగా నిలిచే భారతీయ మహిళ పట్ల నేటి సమాజంలో అవగాహనతో కూడిన గౌరవం పెరుగుతోందని శ్రీ రామకృష్ణ పరమహంస-వివేకానంద సేవా సమితి నిర్వాహకులు చీకటి శ్రీనివాసరావు అన్నారు. "భారతీయ మహిళ - ప్రాధాన్యత" అనే అంశంపై ఆదివారం స్థానిక గీతాంజలి పాఠశాలలో నియోజకవర్గ స్థాయిలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని మహిళల పాత్రపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, సమాజ నిర్మాణంలో మహిళ పాత్ర అనివార్యమని పేర్కొన్నారు. ఒక మహిళకు విద్యనందిస్తే ఒక కుటుంబం మాత్రమే కాకుండా ఒక సమాజం అభివృద్ధి చెందుతుందని, విద్యారంగంలో మహిళల భాగస్వామ్యం మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు. విశ్వశాంతి విద్యాలయం ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు, టాలెంట్ స్కూల్ ప్రిన్సిపల్ పులి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ, కష్టసమయాల్లో కుటుంబాన్ని ధైర్యంగా ముందుకు నడిపించే శక్తి మహిళలకే ఉందన్నారు. మహిళలకు సమాన అవకాశాలు లభించినప్పుడే సమాజం సమతుల్యంగా ఎదుగుతుందని, భారతీయ సంస్కృతి-సంప్రదాయాలను తరతరాలకు అందించే ప్రధాన బాధ్యత మహిళలదేనని వారు స్పష్టం చేశారు.

# బొడిగ బాలయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య–రక్తదాన శిబిరం ఘన విజయం


- 500 మందికి వైద్య సేవలు • 50 మంది రక్తదానం • 130 మందికి ఉచిత కళ్లజోడ్లు పంపిణీ




**చర్లపల్లి, ఫిబ్రవరి 08 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ చర్లపల్లి ప్రాంతంలో బొడిగ బాలయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో, సౌత్ కమలానగర్ పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్ట్ సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం మరియు రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. పెద్ద చర్లపల్లి బస్ స్టాప్ వద్ద ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన ఈ శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.ఈ శిబిరంలో సామాన్య వైద్యం, కంటి పరీక్షలు, దంత పరీక్షలు, బీపీ-షుగర్ పరీక్షలు, చర్మం-జుట్టు సమస్యల నిర్ధారణ, ఎముకల వైద్య పరీక్షలు, ఆయుర్వేద, హోమియోపతి చికిత్సలు, వెల్‌నెస్ ప్రోగ్రాం సేవలను పూర్తిగా ఉచితంగా అందించారు. అనుభవజ్ఞులైన వైద్యులు ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించారు.ఈ సందర్భంగా బొడిగ బాలయ్య ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ బొడిగ రవి మాట్లాడుతూ, "ఆరోగ్యమే సమాజానికి ప్రధాన సంపద అనే భావనతో ప్రతి సంవత్సరం ఉచిత వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు, పేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ, మహిళలకు స్త్రీమంత కార్యక్రమాలు, క్రీడాకారులకు ప్రోత్సాహక బహుమతులు వంటి సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నాం" అని తెలిపారు. పెరుగుతున్న వైద్య ఖర్చుల నేపథ్యంలో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఉపశమనంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.ఈ వైద్య శిబిరంలో 500 మందికి పైగా ప్రజలు వైద్య సేవలు పొందగా 50 మంది రక్తదానం చేశారు.40 మందికి దంత పరీక్షలు 200 మందికి పైగా కంటి పరీక్షలు నిర్వహించగా130 మందికి ఉచిత కళ్లజోడ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పద్మ సాయి డెంటల్ క్లినిక్ డాక్టర్ దినేష్, కమలా నగర్ ఏఆర్‌సి హాస్పిటల్ డాక్టర్ ఏఎస్ఎన్ రాజు, ఐ ప్లానెట్ ఆప్టికల్స్ అనిల్ కుమార్, నాగారం సహస్ర హోమియో క్లినిక్ డాక్టర్ విశ్వనాథరెడ్డి, కాప్రా ఆరోగ్య వర్ధని ఆయుర్వేదిక్ హాస్పిటల్ డాక్టర్ విష్ణుప్రియ, బీపీ-షుగర్ చెకప్ నిర్వహించిన ఆనంద్, వెల్‌నెస్ ప్రోగ్రాం నిర్వహించిన కుమారి, బర్కత్‌పుర జాగృతి బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఈ కార్యక్రమంలో బొడిగ బాలయ్య ట్రస్ట్ అధ్యక్షులు బొడిగ రాజు, బొడిగ జగదాంబ, పంజాల వందన, బొడిగ రజినీకాంత్, బొడిగ క్రాంతికుమార్, దర్శనం కృష్ణ, ఈసీ నగర్ కాలనీ ప్రెసిడెంట్ బూడిద శ్రవణ్ కుమార్, పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షులు సిహెచ్ వరప్రసాద్, నవోదయ సంక్షేమ వేదిక సభ్యులు శ్రీదేవి, ఎం. నాగేంద్ర కుమార్ (ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్) తదితరులు పాల్గొన్నారు.వైద్యులు, స్వచ్ఛంద సేవకులు, సహకరించిన సంస్థలకు ట్రస్ట్ నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యుత్ స్తంభాల ఏర్పాటు ఆలస్యం.. ఎండిపోతున్న ఆయిల్ ఫామ్ తోట

- మోజర్ల రైతు రాజ వర్ధన్ రెడ్డి ఆవేదన

**పెద్దమందడి,ఫిబ్రవరి8(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మోజర్ల గ్రామానికి చెందిన రైతు రాజ వర్ధన్ రెడ్డి తనకు చెందిన 5 ఎకరాల వ్యవసాయ భూమిలో ఆయిల్ ఫామ్ తోటను సాగు చేస్తున్నారు. అయితే తోటకు అవసరమైన నీటి సదుపాయం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయిల్ ఫామ్ తోటకు నీటి సరఫరా కోసం విద్యుత్ అవసరం కాగా, ఇందుకు సంబంధించిన విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు అవసరమైన అన్ని అనుమతులను ఇప్పటికే సంబంధిత అధికారుల నుంచి పొందినట్లు రైతు తెలిపారు.అనుమతులు మంజూరై చాలాకాలం గడిచినా ఇప్పటివరకు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయకపోవడం వల్ల తోటకు నీరు అందడం లేదని, దీంతో పంట ఎండిపోతున్న పరిస్థితి నెలకొందని ఆయన వాపోతున్నారు.ఎన్నో ఆశలతో ఆయిల్ ఫామ్ సాగు ప్రారంభించానని, ప్రస్తుతం తోటను కాపాడుకునే పరిస్థితి లేక మానసికంగా, ఆర్థికంగా తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటున్నానని రాజ వర్ధన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఇప్పటికే పలుమార్లు సంబంధిత అధికారులను సంప్రదించి విజ్ఞప్తి చేసినప్పటికీ స్పందన లేదని ఆయన ఆరోపించారు.ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి, తోటకు నీటి సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు.ఆలస్యం జరిగితే తోట పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉందని, రైతు సమస్యపై అధికారులు దయ చూపాలని గ్రామస్తులు కూడా విజ్ఞప్తి చేస్తున్నారు. విద్యుత్ శాఖ ఏఈ వివరణ ఈ అంశంపై పెద్దమందడి విద్యుత్ శాఖ ఏఈని వివరణ కోరగా, ఆయిల్ ఫామ్ తోటకు వెళ్లే మార్గంలో పక్కా రైతు అభ్యంతరం వ్యక్తం చేయడంతో వివాదం నెలకొన్నట్లు తెలిపారు. ఇద్దరు రైతులు పరస్పర అవగాహనకు వచ్చి, గ్రామ పెద్దల సమక్షంలో సమస్యను పరిష్కరించుకుంటే, విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు శాఖ తరఫున ఎలాంటి అభ్యంతరం ఉండదని, సమస్య పరిష్కారానికి ముందుంటామని ఆయన స్పష్టం చేశారు.

# ఐసిసి అండర్–19 వరల్డ్ కప్ విజేత ఆరోన్ జార్జ్‌కు ఘన స్వాగతం

- శంషాబాద్ విమానాశ్రయంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అభినందనలు



**హైదరాబాద్, ఫిబ్రవరి 08 (తెలంగాణ ముచ్చట్లు):** భారతదేశానికి ప్రతిష్టాత్మకమైన ఐసిసి అండర్-19 క్రికెట్ వరల్డ్ కప్ విజయం అందించడంలో కీలక పాత్ర పోషించిన మల్లాపూర్ వాసి ఆరోన్ జార్జ్ హైదరాబాద్‌కు చేరుకున్న సందర్భంగా, శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు.దేశానికి గర్వకారణంగా నిలిచిన ఆరోన్ జార్జ్‌కు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.అండర్-19 వరల్డ్ కప్ విజయం ద్వారా భారత క్రికెట్ ప్రతిష్టను ప్రపంచ స్థాయిలో మరింత పెంచినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఘన విజయం యువతకు స్ఫూర్తిదాయకమని, భవిష్యత్తులో ఇంకా ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ దేశానికి మరిన్ని విజయాలు అందించాలని ఆకాంక్షించారు.మల్లాపూర్ ప్రాంతానికి, ఉప్పల్ నియోజకవర్గానికి ఆరోన్ జార్జ్ తెచ్చిన కీర్తి అపూర్వమని ఎమ్మెల్యే ప్రశంసించారు. స్థానిక యువతకు ఆయన ఆదర్శప్రాయుడిగా నిలిచారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో మల్లాపూర్ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



# వడ్డెర కార్పొరేషన్లో రుణాలు మంజూరు చేయాలి

- వడ్డెర సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు కుంచపు రాంబాబు

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 8 (తెలంగాణ ముచ్చట్లు)

ఆదివారం వడ్డెర సంఘం రాష్ట్ర నాయకులు నర్రా ఎల్లయ్య ఆధ్వర్యంలో జరిగింది సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డేరంగుల బ్రహ్మం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో వడ్డెర యవతకు ఉపాధి కల్పన కోసం వడ్డెర కార్పొరేషన్ ద్వారా 70% సబ్సిడీతో రుణాలు మంజూరు చేసి జేసిపిలు, క్వారీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు అదేవిధంగా ప్రభుత్వ కాంట్రాక్ట్ పనుల్లో గత ఉమ్మడి రాష్ట్రంలో వడ్డెర సొసైటీల కు 15% రిజర్వేషన్ లు ఉండేవని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కామారెడ్డి బిసి డిక్లరేషన్ లో ప్రకటించిన విధంగా ప్రభుత్వ కాంట్రాక్ట్ పనుల్లో బిసిలకు 42% రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పారని ఆయన అన్నారు రాబోయే రోజుల్లో వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రతి గ్రామంలో ఉన్న వడ్డెర సొసైటీలకు రెండు కోట్ల రూపాయల రుణాలను ఇవ్వాలనే డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వల్లపు సోమరాజు, కొంచెం వెంకటేశ్వర్లు, ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి జ్యోతిబస్, ట్రెజరర్ తమ్మిశెట్టి వీర్రాజు, బత్తుల నాగేశ్వరావు, పీట్ల స్వర్ణ కుమార్, దేవల్ల వీరబాబు, తదితరులు పాల్గొన్నారు



# సోనియా గాంధీ నగర్‌లో నూతన సొసైటీ కార్యాలయ ప్రారంభం

- కాలనీ అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తాం : ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

చర్లపల్లి, ఫిబ్రవరి 08 (తెలంగాణ ముచ్చట్లు):

ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ చర్లపల్లి డివిజన్ పరిధిలోని సోనియా గాంధీ నగర్ ఫేజ్-1లో కాలనీ వాసుల అవసరాల కోసం నూతనంగా ఏర్పాటు చేసిన సొసైటీ కార్యాలయాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఆనందం వ్యక్తం చేశారు. కార్యాలయ ప్రారంభం అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల నుంచి తన దృష్టికి వచ్చే ప్రతి సమస్యను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. పార్టీలకు అతీతంగా నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధే తన ధ్యేయమని పేర్కొన్నారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు.సొసైటీ కార్యాలయం ద్వారా కాలనీకి సంబంధించిన సమస్యలను సమగ్రంగా చర్చించుకునే అవకాశం కలుగుతుందని, కాలనీ అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లేందుకు ఇది దోహదపడుతుందని ఎమ్మెల్యే అన్నారు.ప్రజా ప్రతినిధులు-ప్రజల మధ్య వారధిగా ఈ కార్యాలయం పనిచేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు బిక్షపతి, గౌరవ అధ్యక్షుడు బాల నర్సింహా, కాలనీ పెద్దలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.




# ఇంజనీర్‌గా హరిప్రసాద్ గౌడ్ సేవలు అభినందనీయం

- సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షులు పలుసా శంకర్ గౌడ్

వనపర్తి,ఫిబ్రవరి8(తెలంగాణ ముచ్చట్లు):

విద్యుత్ శాఖలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా ప్రారంభమై ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరకు వివిధ హోదాల్లో సుమారు 35 సంవత్సరాల పాటు సేవలందించి ఇటీవల పదవీ విరమణ చేసిన పబ్బా హరిప్రసాద్ గౌడ్‌కు మహబూబ్‌నగర్ పట్టణంలోని పద్మావతి కాలనీలోని ఆయన నివాసం సమీపంలో కుటుంబ సభ్యుల మధ్య ఘనంగా రిటైర్మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై హరిప్రసాద్ గౌడ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యుత్ ఇంజినీరింగ్ విభాగం కోసం హరిప్రసాద్ గౌడ్ చేసిన సేవలు మరువలేనివని అన్నారు. అంకితభావం, క్రమశిక్షణతో పనిచేసిన ఇంజనీర్‌గా ఆయన అందరికీ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు.అసిస్టెంట్ ఇంజనీర్‌గా,డిప్యూటీ ఇంజనీర్‌గా,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా వివిధ హోదాల్లో పనిచేస్తూ విద్యుత్ శాఖకు విలువైన సేవలందించారని తెలిపారు.అంకితభావంతో పనిచేసిన వారు ఉన్నత స్థాయికి ఎదుగుతారనే విషయానికి హరిప్రసాద్ గౌడ్ ప్రత్యక్ష ఉదాహరణ అని శంకర్ గౌడ్ పేర్కొన్నారు.కుటుంబ విలువలు క్రమంగా తగ్గిపోతున్న ఈ రోజుల్లో, ఎలాంటి ఆర్భాటం లేకుండా కుటుంబ సభ్యుల మధ్యనే రిటైర్మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో హరిప్రసాద్ గౌడ్ కుటుంబ సభ్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు పాల్గొని ఆయనను అభినందించారు.

# డాక్టర్ ఎ.ఎస్. రావు సైన్స్ టాలెంట్ సర్చ్ అవార్డుల ప్రదానం

- రెండు తెలుగు రాష్ట్రాల ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు పురస్కారాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 08 (తెలంగాణ ముచ్చట్లు):





మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ఉప్పల్ నియోజకవర్గంలోని కాప్రా సర్కిల్ పరిధిలో గల డాక్టర్ హోమి జె. భాభా కమ్యూనిటీ హాల్, డాక్టర్ ఎ.ఎస్. రావు నగర్‌లో డాక్టర్ ఎ.ఎస్. రావు అవార్డుల మండలి ఆధ్వర్యంలో సైన్స్ టాలెంట్ సర్చ్ అవార్డుల ప్రదాన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు.రెండు తెలుగు రాష్ట్రాల్లోని 9వ, 10వ తరగతుల విద్యార్థుల కోసం గతేడాది డిసెంబర్ 28, 2025న నిర్వహించిన సైన్స్ టాలెంట్ సర్చ్ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఈ అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ శాస్త్రవేత్త, ఎన్ఎఫ్‌సీ బోర్డు ఛైర్మన్ మరియు చీఫ్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ కోమల్ కపూర్ విజేతలకు నగదు పురస్కారాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు.9వ తరగతిలో ప్రథమ స్థానం సూర్యాపేటకు చెందిన కుమారి యాస వీక్షణ, ద్వితీయ స్థానం ఖమ్మంకు చెందిన కుమారి ఇషా సింగ్, తృతీయ స్థానం ఖమ్మంకు చెందిన ధరావత్ హర్షవర్ధన్ సాధించారు .10వ తరగతిలో ప్రథమ స్థానం సూర్యాపేటకు చెందిన కుమారి ఉలువల వైష్ణవి, ద్వితీయ స్థానం రాజమండ్రికి చెందిన గట్టి జయంత్ అశ్విన్, తృతీయ స్థానం ఖమ్మంకు చెందిన కుమారి లక్ష్మీ శార్వాణి రుద్రభట్ల సాధించారు.ప్రథమ స్థానం సాధించిన విద్యార్థుల కు రూ.25,000, ద్వితీయ స్థానానికి రూ.15,000, తృతీయ స్థానానికి రూ.10,000 చొప్పున నగదు పురస్కారాలు అందజేశారు.అదనంగా 9వ తరగతిలో 18 మంది, 10వ తరగతిలో 17 మంది ర్యాంకర్లను ప్రకటించి వారందరికీ ప్రశంసా పత్రాలు, మెమెంటోలు అందజేశారు. పరీక్షల నిర్వహణలో సహకరించిన పలు పాఠశాల యాజమాన్యాలను ఈ సందర్భంగా సన్మానించారు.ఈ కార్యక్రమానికి డాక్టర్ ఎ.ఎస్. రావు అవార్డుల మండలి అధ్యక్షులు డా.జి.ఎస్.వి.ఆర్.కె. చౌదరి అధ్యక్షత వహించగా, అడ్వైజర్లు ప్రొఫెసర్ ఎల్.ఎస్. రావు, ప్రొఫెసర్ సి. నాగేశ్వరరావు, కౌన్సిల్ కార్యదర్శి కె. రామరాజు పాల్గొన్నారు. అలాగే సంస్థ ప్రతినిధులు ఆర్. కృష్ణమూర్తి, డా. ఎస్. రమణ, సి. చంద్రశేఖరమ్, టి. వేణుగోపాల రావు, జి. కృష్ణమూర్తి, డా. ఎం.వి.ఎస్. మహేంద్ర, వై.వి. సుబ్బారావు, కె. మహాదేవ్, ఎన్‌టీకే హరి నాధరావు, యు. శేఖర్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# గోవా పీసీసీ కార్యాలయంలో ఏఐపీసీ నేతల భేటీ

- పార్టీ బలోపేతం, రాష్ట్రాల మధ్య సమన్వయంపై విస్తృత చర్చ
- పాల్గొన్న జిల్లెల ఆదిత్య రెడ్డి

వనపర్తి,ఫిబ్రవరి8(తెలంగాణ ముచ్చట్లు):




ఏఐపీసీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా. జిల్లెల ఆదిత్య రెడ్డి , డా. మాసి రెడ్డితో కలిసి గోవా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (గోవా పీసీసీ) కార్యాలయాన్ని సందర్శించారు. గోవాలో ప్రస్తుతం జరుగుతున్న జనరల్ మీటింగ్ సందర్భంగా అక్కడి సీనియర్ కాంగ్రెస్ నాయకులతో ఆయన భేటీ అయ్యారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత వ్యవహారాలు, వివిధ రాష్ట్రాల మధ్య సమన్వయం, పార్టీని గ్రామ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు మరింత బలోపేతం చేయడంపై విస్తృతంగా చర్చ జరిగింది.పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లడం, కార్యకర్తల భాగస్వామ్యాన్ని పెంచడం, భవిష్యత్ కార్యాచరణపై కూడా నాయకులు అభిప్రాయాలు పంచుకున్నారు.ఈ సమావేశం ద్వారా కాంగ్రెస్ పార్టీలో ఐక్యత, సక్రియ భాగస్వామ్యం, సమిష్టి నాయకత్వంపై ఏఐపీసీ నిబద్ధత మరోసారి స్పష్టమైందని నాయకులు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని మరింత బలంగా తీర్చిదిద్దేందుకు అన్ని రాష్ట్రాల నాయకులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.ఏఐపీసీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా. జిల్లెల ఆదిత్య రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడమే లక్ష్యంగా ఏఐపీసీ పనిచేస్తోందని, రాష్ట్రాల మధ్య సమన్వయం ద్వారా కాంగ్రెస్ పార్టీకి కొత్త ఉత్సాహం తీసుకురావచ్చని తెలిపారు.

# రైతాంగానికి అండగా నిలిచిన కేసీఆర్‌కు మద్దతుగా నిలవాలి

- మాజీ ఎంపీ నామ

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 8(తెలంగాణ ముచ్చట్లు)





మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా వైరా మున్సిపాలిటీ ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటేసి బీఆర్ఎస్ అభ్యర్థులను ఆశీర్వదించి మంచి మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ప్రజలను కోరారు. ఆదివారం నాడు బీఆర్ఎస్ ముఖ్య నేతలతో కలిసి చైర్‌పర్సన్ అభ్యర్థి కట్టా స్వరూపరాణి, 18వ వార్డు అభ్యర్థి రాచబంటి శ్రీదేవి, 19వ వార్డు దామ ఉమ, 17వ వార్డు రాచర్ల పద్మ, 10వ వార్డు కిన్నెర కృష్ణ, 11వ వార్డు దొంతెబోయిన వెంకటేశ్వర్లుల విజయాన్ని కాంక్షిస్తూ ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరి ఆశీర్వాదంతో తాను రెండు సార్లు పార్లమెంట్‌కు వెళ్లడం జరిగిందన్నారు. పదిహేడవ లోక్‌సభలో కేసీఆర్ నాయకత్వంలో ప్రజా సమస్యలపై పోరాడి రాష్ట్రానికి రావాల్సిన నిధులను రాబట్టామన్నారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో నాలుగు కోట్లతో శాంతినగర్ నుండి లాలాపురం వరకు బీటీ రోడ్ మంజూరు చేయించడంతో పాటు గ్రామంలో అనేక సీసీ రోడ్లు వేయించడం జరిగిందన్నారు. అలాగే నామ ముత్తయ్య మెమోరియల్ ట్రస్ట్ ద్వారా బోర్లు వేయించడం, మొదటిసారి ఎంపీ అయినప్పుడు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఒక లక్ష గ్యాస్ కనెక్షన్లు ఇవ్వడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తర్వాత దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతు బంధు, రైతు భీమా వంటి సంక్షేమ పథకాలను తీసుకువచ్చి రైతాంగానికి అండగా నిలిచిన నాయకుడు కేసీఆర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత రాష్ట్రంలో తాగు, సాగునీరు, విద్యుత్ కష్టాలు లేకుండా చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ అంటేనే యూరియా కష్టాలు, రైతాంగానికి అవస్థలు అని విమర్శించారు. కేసీఆర్ పాలనలో ఆయన సూచనల మేరకు పార్లమెంట్‌లో కేంద్రంపై పోరాడి రాష్ట్ర రైతాంగానికి సరిపడా యూరియా నిల్వలు తీసుకువచ్చి అందుబాటులో ఉంచామన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఇప్పుడు ఎన్నికల ప్రచారానికి వచ్చే కాంగ్రెస్ నాయకులను బాకీ కార్డుతో నిలదీయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం, వైరా నియోజకవర్గ ముఖ్య నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు ఓటు వేయండి.. పదిమందితో వేయించండి

- 31వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి తరపున ప్రచారం చేసిన ఎమ్మెల్యే సతీమణి శారద రెడ్డి

వనపర్తి,ఫిబ్రవరి8(తెలంగాణ ముచ్చట్లు):




రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ప్రతి ఒక్కరూ ఓటు వేసి, మరో పదిమందితో కూడా ఓటు వేయించాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సతీమణి శారద రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా వనపర్తి పట్టణంలోని 31వ వార్డులో ఆమె పర్యటించి, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి విజయలక్ష్మి రాధాకృష్ణ ని అఖండ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఇంటింటి ప్రచారానికి వెళ్లిన ఎమ్మెల్యే సతీమణి శారద రెడ్డి కి స్థానికులు ఘన స్వాగతం పలికారు. నుదుట తిలకం దిద్ది, శాలువాలతో సత్కరించి హస్తం గుర్తుకే ఓటు వేస్తామని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా శారద రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల వ్యవధిలోనే అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి మహిళలకు వెన్నుదన్నుగా నిలిచిందని అన్నారు.మహిళల పేరుతో ఇందిరమ్మ ఇళ్లు, మహిళల పేరుతోనే రేషన్ కార్డులు, ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం, మహిళలకు వడ్డీ లేని రుణాలు, గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో మహిళా సమాఖ్యలకు నూతన భవనాలు, క్యాంటీన్లు, డీజిల్ బంకుల ఏర్పాటు, పాఠశాల విద్యార్థుల స్కూల్ డ్రెస్‌ల తయారీని మహిళలకు అప్పగించడం వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే వనపర్తి పట్టణం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. రానున్న కాలంలో వనపర్తి అన్ని రంగాల్లో ముందుండాలంటే కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు.31వ వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయలక్ష్మి ని కౌన్సిలర్‌గా గెలిపిస్తే వార్డులోని అన్ని సమస్యలు త్వరితగతిన పరిష్కారం అవుతాయని శారద రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తా: ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

- ఉప్పల్ ప్రెస్ క్లబ్ నూతన కమిటీకి అభినందనలు

ఉప్పల్, ఫిబ్రవరి 08 (తెలంగాణ ముచ్చట్లు):



జర్నలిస్టుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం ఉప్పల్ ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ప్రతినిధులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు .ఈ సందర్భంగా ఉప్పల్ ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన వేముల తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి గ్యారంపల్లి శివాజీ, వర్కింగ్ ప్రెసిడెంట్ పారేల్లి సాగర్, ఉపాధ్యక్షులు ఏవి శ్రీధర్ రావు, కూకుట్ల నరోత్తం రెడ్డి, కోశాధికారి గుత్తి శేఖర్, జాయింట్ సెక్రటరీ దాస రాజు తదితర కమిటీ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. అలాగే సీనియర్ జర్నలిస్టులు దొంతుల వెంకటరామిరెడ్డి, కొలనుపాక చంద్రమౌళి, పల్లా మహేందర్ రెడ్డి, కోడికంటి శ్రీనివాస్, ఎస్. ముత్యంరెడ్డి, ఓ. రమేష్, రాజులను కూడా ఆయన ప్రత్యేకంగా సత్కరించారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధిలో పాత్రికేయుల పాత్ర ఎనలేనిదని పేర్కొన్నారు. ప్రజలతో నిత్యం మమేకమై వారి సమస్యలను అధికారుల, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చే బాధ్యతను జర్నలిస్టులు సమర్థంగా నిర్వహిస్తున్నారని కొనియాడారు. నూతనంగా ఎన్నికైన ఉప్పల్ ప్రెస్ క్లబ్ కమిటీకి ఎల్లప్పుడూ తన పూర్తి సహకారం, మద్దతు ఉంటుందని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

# డిజిటల్ మీడియా నమ్మదగిన సమాచారాన్ని ప్రజలకు చేరవేయాలి

- **మాజీ సమాచార కమిషనర్ పి. విజయబాబు**

**హైదరాబాద్, ఫిబ్రవరి 08 (తెలంగాణ ముచ్చట్లు):**

డిజిటల్ న్యూస్ మీడియా వేగంగా సమాచారాన్ని అందించడమే కాకుండా, ఖచ్చితమైన మరియు నమ్మదగిన వార్తలను ప్రజలకు చేరవేయాల్సిన బాధ్యతను మరింత బలంగా నిర్వర్తించాల్సిన అవసరం ఉందని ప్రముఖ జర్నలిస్ట్, మాజీ సమాచార కమిషనర్ పి. విజయబాబు అన్నారు.

తెలుగు రాష్ట్రాలలో తొలిసారిగా డిజిటల్ న్యూస్ మీడియా ఛానళ్లకు అవార్డులు అందజేయడం విశేషమని పేర్కొన్నారు. విజయ




వాడలోని హోటల్ లీలా గ్రాండ్‌లో ఘనంగా నిర్వహించిన ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆంధ్ర అడ్వకేట్ ఫోరం కన్వీనర్ బి. అశోక్ కుమార్ మరో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా విజయబాబు మాట్లాడుతూ, వార్తలను నిష్పాక్షికంగా, నిజానిజాలు నిర్ధారించుకున్న తరువాతే ప్రచురించాలని సూచించారు. ఫేక్ న్యూస్ వ్యాప్తిని అరికట్టడం డిజిటల్ మీడియా ప్రధాన బాధ్యత అని తెలిపారు. సమాజంలో అలజడులు సృష్టించే లేదా విద్వేషాలను పెంచే వార్తలను పూర్తిగా నివారించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో మీడియా నాలుగో స్తంభంగా ప్రభుత్వాన్ని ప్రజలకు జవాబుదారీగా నిలబెట్టే కీలక పాత్ర పోషిస్తుందని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో దూరదర్శన్ మాజీ అధికారి ఎన్.వి. హనుమంతరావు, సోషల్ మీడియా క్లబ్ ఆఫ్ ఏపీ చైర్మన్ సన్ మూర్తి, ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు తిప్పరాజు రమేష్ బాబు, ఆంధ్రప్రదేశ్ ఎడిటర్ అసోసియేషన్ అధ్యక్షుడు వివిఆర్ కృష్ణంరాజు, కన్వీనర్ ఎం.ఆర్. పాషా తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా డిజిటల్ న్యూస్ మీడియా ఆఫ్ ది ఇయర్ - 2026 అవార్డును ధర్మపీఠం విత్ ఏబీఆర్ డిజిటల్ న్యూస్ మీడియా ఛానల్ చైర్మన్ భాస్కర్ రెడ్డికి ప్రదానం చేశారు. ఈ అవార్డు డిజిటల్ మీడియా రంగానికి మరింత ప్రోత్సాహాన్ని అందిస్తుందని నిర్వాహకులు తెలిపారు.

# సత్తుపల్లిలో బీఆర్ఎస్ భారీ ఎన్నికల ప్రచారం.!

- **సండ్ర ఆధ్వర్యంలో ర్యాలీ, డోర్ టు డోర్ కార్యక్రమం**

**సత్తుపల్లి, ఫిబ్రవరి 8 (తెలంగాణ ముచ్చట్లు):**

ఈ నెల 11వ తేదీన జరగనున్న సత్తుపల్లి మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ప్రచారాన్ని ఉధృతం చేసింది. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య ఆధ్వర్యంలో సత్తుపల్లి మున్సిపాలిటీలో భారీ ర్యాలీతో పాటు డోర్ టు డోర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని పలు వార్డుల గుండా నిర్వహిం





చిన ర్యాలీలో పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రజల్లో ఉత్సాహాన్ని నింపారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్న సండ్ర వెంకట వీరయ్య, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. పట్టణ అభివృద్ధి కొనసాగాలంటే బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో పార్టీ నాయకులు, మున్సిపల్ అభ్యర్థులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణతో బీఆర్ఎస్ శ్రేణుల్లో విశ్వాసం పెరిగిందని నాయకులు తెలిపారు. ఈ నెల 11న జరిగే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుందనే నమ్మకాన్ని వారు వ్యక్తం చేశారు.

# బీబీసాహెబ్ మక్తాలో మౌలిక వసతుల అభివృద్ధి పనులకు శ్రీకారం

- **సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.90 లక్షల నిధుల మంజూరు**

**ఉప్పల్, ఫిబ్రవరి 08 (తెలంగాణ ముచ్చట్లు):**

జీహెచ్ఎంసీతో సమానంగా శివారు కాలనీల అభివృద్ధికీ ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. పూర్వ పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బీబీసాహెబ్ మక్తా ప్రాంతం ఉప్పల్ డివిజన్‌లో విలీనం అయిన నేపథ్యంలో అక్కడ మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆయన పేర్కొన్నారు. బీబీసాహెబ్ మక్తా పరిధిలోని శ్రీశ్రీనగర్, ఎస్ఎన్ కాలనీ, కృష్ణారెడ్డి కాలనీ, ఫ్రెండ్స్ కాలనీ, అమృత కాలనీల్లో ఇటీవల కార్పొరేటర్ రజితాపరమేశ్వర్‌రెడ్డి ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు తమ సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చారు. కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు శ్రీశ్రీనగర్ కాలనీలో దెబ్బతిన్న సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.90 లక్షల నిధులను మంజూరు చేయించినట్లు కార్పొరేటర్ తెలిపారు. ఈ నిధుల మంజూరుకు సంబంధించిన పత్రాలను పరమేశ్వర్‌రెడ్డితో కలిసి కాలనీవాసులకు అందజేశారు.మిగిలిన కాలనీల్లో కూడా దశలవారీగా అభివృద్ధి పనులకు అవసరమైన



నిధులు మంజూరు చేయించనున్నట్లు రజితాపరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. మంజూరైన నిధులతో పనులను సకాలంలో ప్రారంభించి, వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఐలేష్ యాదవ్, నాగరాజ్, భారత్ రాజ్ గౌడ్, మనోజ్, హిమాముద్దీన్, నంద కిషోర్, అప్పన శ్రీనివాస్, నసీరుద్దీన్, పుల్లరావు, సలా ప్రభాకర్ రెడ్డి, సాయి రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.





# అంబేద్కర్ ఇచ్చిన ఓటు దేశప్రజల వజ్రాయుధం

- **కీసరలో విజయవంతమైన 209వ వారం జ్ఞానమాల కార్యక్రమం**

**కీసర, ఫిబ్రవరి 08 (తెలంగాణ ముచ్చట్లు):**


భారతదేశ ప్రజల తలరాతలు మార్చేందుకు భారత రాజ్యాంగ నిర్మాత డా.బాబాసాహెబ్ అంబేద్కర్ ఓటు అనే శక్తివంతమైన ఆయుధాన్ని దేశ ప్రజలకు అందించారని, ఆ ఓటును డబ్బులకు అమ్ముకోవద్దని మెడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ సేవాదళ్ బిబ్లాక్ అధ్యక్షుడు జనగం మహేంద్ర భూపతి అన్నారు.కీసర మండల అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో 209వ వారం జ్ఞానమాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంఘం అధ్యక్షుడు కర్రె గణేష్, ప్రధాన కార్యదర్శి మంచాల సంజీవ్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా జనగం మహేంద్ర భూపతి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి జ్ఞానమాల సమర్పించి ప్రసంగించారు.అంబేద్కర్ కులం అనే రక్కసిని నిర్మూలించి, సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం వంటి విలువలతో కూడిన ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని దేశానికి అందించిన మహనీయుడని ఆయన కొనియాడారు. ప్రస్తుతం జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లు నోటు కోసం ఓటును అమ్ముకోవద్దని, ఓటు అనేది దేశ ప్రజల వజ్రాయుధమని అన్నారు. ప్రతి వ్యక్తి అంబేద్కర్ జీవిత చరిత్రను అధ్యయనం చేస్తే ఆయన ఎదుర్కొన్న కష్టాలు, అవమానాలు తెలిసి, వాటిని అధిగమించిన తీరునుంచి సమాజ మార్పుకు ప్రేరణ పొందవచ్చని పేర్కొన్నారు. సమాజంలో నిజమైన మార్పు విద్య ద్వారానే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కీసర మండల అంబేద్కర్ సంఘం ఉపాధ్యక్షులు పులిపాక తిరుపతి, బత్తుల ఆంజనేయులు, బొల్లి మహేష్, కోశాధికారి రొండ్ల మహేష్, సంయుక్త కార్యదర్శులు గంగి ఆంజనేయులు, కుర్రి పరమేష్, మంచాల మహేష్, తాళ్ల కిరణ్, ముఖ్య సలహాదారులు దాయర బాల్ నర్సింహ, రాగుల రమేష్ ముదిరాజ్ పాల్గొన్నారు. అలాగే కీసర గ్రామశాఖ నాయకులు తుడుం బాల్ రాజ్, కీసర మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చీర వినోద్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మంచాల ప్రవీణ్, దుర్గం కృష్ణ, జలగం శ్రీనివాస్, 108 వైద్యులు చిత్రం రవి తదితరులు హాజరయ్యారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తా

- **ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి**
- **ఉప్పల్ ప్రెస్ క్లబ్ నూతన కమిటీని అభినందించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి**

**హైదరాబాద్,ఫిబ్రవరి08(తెలంగాణ ముచ్చట్లు):**

జర్నలిస్టుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఉప్పల్ ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఉప్పల్ ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన వేముల తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి గ్యారంపల్లి శివాజీ, వర్కింగ్ ప్రెసిడెంట్ పారేల్లి సాగర్. ఉపాధ్యక్షులు ఏవి శ్రీధర్





రావు, కూకుట్ల నరోత్తం రెడ్డి, కోశాధికారి గుత్తి శేఖర్, జాయింట్ సెక్రటరీ దాస రాజు మరియు సీనియర్ జర్నలిస్టులు దొంతుల వెంకటరామిరెడ్డి, కొలనుపాక చంద్రమౌళి, పల్లా మహేందర్ రెడ్డి, కోడికంటి శ్రీనివాస్, ఎస్. ముత్యంరెడ్డి, ఓ.రమేష్, రాజులను ఆయన అభినందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధిలో పాత్రికేయుల పాత్ర ఎనలేనిదని తెలిపారు. ప్రతి నిమిషం ప్రజలతో మమేకమై ప్రజల సమస్యలను అధికారులు ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకురావడంలో పాత్రికేయుల పాత్ర అభినందనీయమని తెలిపారు. నూతనంగా ఎన్నికైన ఉప్పల్ ప్రెస్ క్లబ్ కమిటీకి తన వంతు సహాయక సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు.

# సత్తుపల్లి మున్సిపల్ ఎన్నికల కోఆర్డినేటర్‌గా చల్లగుళ్ళ

- **పీసీసీ ఉత్తర్వులు జారీ.**
- **23 వార్డుల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యం.**
- **చల్లగుళ్ళ నరసింహారావు.**

**సత్తుపల్లి, ఫిబ్రవరి 8 (తెలంగాణ ముచ్చట్లు):**

సత్తుపల్లి మున్సిపల్ ఎన్నికల కోఆర్డినేటర్‌గా సత్తుపల్లి నియోజకవర్గ సీనియర్ నాయకులు చల్లగుళ్ళ నరసింహారావును నియమించారు. తెలంగాణ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ఈ నియామకానికి సంబంధించిన ఉత్తర్వులను జారీ చేశారు. ఈ మేరకు పీసీసీ నుంచి అధికారిక ఉత్తర్వులు



వెలువడ్డాయి. ఈ సందర్భంగా చల్లగుళ్ళ నరసింహారావు మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచిన పార్టీ రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 23 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి సమిష్టిగా కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.



# వనపర్తి అభివృద్ధికి కాంగ్రెస్‌కే ఓటు

- **27వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థుల తరపున ప్రచారం చేసిన డా. జిల్లెల చిన్నారెడ్డి**

**వనపర్తి,ఫిబ్రవరి8(తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి పట్టణ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలపాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం వనపర్తి పట్టణంలోని 27వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి సరిత రవి తరపున ఆయన గడపగడప తిరుగుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా రామాలయంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం ఓటర్లను కలిశారు.అలాగే 33వ వార్డులో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి ఎస్ఎల్ఎన్ మాధవి రమేష్‌ని గెలిపించాలని కోరారు. డా. చిన్నారెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని అన్నారు.పెండింగ్‌లో ఉన్న పట్టణ అభివృద్ధి పనులను వేగవంతం చేశామని, రాబోయే రోజుల్లో వనపర్తిని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని తెలిపారు.ప్రజలు హస్తం గుర్తుకే మద్దతు తెలపాలని కోరారు.ఈ ప్రచారంలో జిల్లా, మండల్, పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ అభ్యర్థులకు ప్రైవేట్ విద్యాసంస్థల మద్దతు

- **సత్తుపల్లి మున్సిపల్ ఎన్నికల్లో రాధిక నాయుడు, ప్రభాకర్ రెడ్డికి ట్రస్మా అండ**

**సత్తుపల్లి, ఫిబ్రవరి 8 (తెలంగాణ ముచ్చట్లు):**

ఈ నెల 11న జరగనున్న సత్తుపల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులకు జిల్లా ప్రైవేట్ విద్యాసంస్థల సంఘం (ట్రస్మా) మద్దతు ప్రకటించింది.

రెండో వార్డు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో ఉన్న రాధిక నాయుడు (మదర్ తెరిసా టెక్నో స్కూల్), 22వ వార్డు నుంచి పోటీ చేస్తున్న మందపాటి ప్రభాకర్ రెడ్డి (గౌతమ్ మోడల్ స్కూల్)లకు ట్రస్మా జిల్లా అధ్యక్షులు కాంతారావు ఆధ్వర్యంలో ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి డివిజన్‌ల సంఘ బాధ్యులు ఆదివారం సాయంత్రం కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా విద్యారంగ అభివృద్ధి, ప్రైవేట్ విద్యాసంస్థల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని సంఘ నాయకులు పేర్కొన్నారు.



# అశోక్ నగర్ వడ్డెర సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ


- **ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా ఘన కార్యక్రమం**

**మల్లాపూర్, ఫిబ్రవరి 08 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గం పాత మల్లాపూర్ డివిజన్ పరిధిలో ని అశోక్ నగర్ వడ్డెర సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, వడ్డెర సంఘం ద్వారా చేపడుతున్న సామాజిక సేవలు అభినందనీయమని కొనియాడారు. సమాజ అభివృద్ధికి సంఘం చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొంటూ, భవిష్యత్తులో కూడా తమ పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘ అధ్యక్షులు బి. లక్ష్మీనారాయణ, వి. నర్సింహా, ఉపాధ్యక్షులు, సంయుక్త కార్యదర్శులు, సంఘ కార్యదర్శులు తదితర సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## 18వ వార్డు అభివృద్ధికి అవకాశం ఇవ్వండి

# అభివృద్ధి చేసి చూపిస్తా

- **బీజేపీ అభ్యర్థి బి. నరసింహా**

**వనపర్తి,ఫిబ్రవరి8(తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ తరఫున 18వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా బి. నరసింహా పోటీ చేస్తున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 18వ వార్డు ప్రజలు తనకు ఒక్క అవకాశం ఇస్తే వార్డు అభివృద్ధిని చేసి చూపిస్తానని అన్నారు.ఎన్నికల ప్రచారంలో భాగంగా బి. నరసింహా ఇంటింటికి తిరుగుతూ ఓటర్లను కలుసుకుని, బీజేపీ పార్టీ రూపొందించిన హామీల మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేస్తూ, వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని తెలిపారు.రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు వంటి మౌలిక వసతులతో పాటు, పేదలు, మహిళలు, యువతకు ఉపయోగపడే పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తానని హామీ ఇచ్చారు.బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నేరుగా ప్రజలకు అందేలా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు .ఈ సందర్భంగా బీజేపీ పార్టీ అభ్యర్థి నరసింహా మాట్లాడుతూ, 18వ వార్డు ప్రజలు కమలం గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో జిల్లా దళిత మోర్చా కార్యదర్శి ప్రవీణ్ కుమార్, పెద్ద మందడి మండల అధ్యక్షుడు ముప్పూరి చెన్నయ్య,మాజీ అధ్యక్షుడు తిరుపతియ్య (గున్న భాయ్) వెంకటేష్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 12 జాతీయ సమ్మెను జయప్రదం చేయాలి

- **కీసరలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల సదస్సు**

**కీసర, ఫిబ్రవరి 08 (తెలంగాణ ముచ్చట్లు):**




కార్మిక వర్గం పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులు, చట్టాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. 2026 ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త జాతీయ సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కీసర కార్మిక ఐక్యవేదిక ఆధ్వర్యంలో 2 బీ హెచ్ కె అహ్మద్ గూడా, ఫేజ్-1, బ్లాక్-15 వద్ద కార్మికుల సదస్సు నిర్వహించారు.ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన పరశురాం మాట్లాడుతూ, రవాణా రంగంలో పనిచేస్తున్న డ్రైవర్లు, హెల్పర్లు సహా అన్ని కార్మికులకు ప్రత్యేక వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 2019 మోటార్ వెహికల్ యాక్ట్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఎండి. ఖాదర్ మాట్లాడుతూ, అసంఘటిత రంగ కార్మికుల వెల్ఫేర్ బోర్డును సంరక్షించి, భవన నిర్మాణ కార్మికులందరికీ సంక్షేమ, ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని అన్నారు. పట్టణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేసి సంవత్సరానికి కనీసం 120 రోజుల పని కల్పించాలని డిమాండ్ చేశారు.సీఐటీయూ కీసర మండల కార్యదర్శి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కమిటీ నాయకులు బంగారు నర్సింగరావు మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. లేబర్ కోడ్‌ల పేరిట కార్మికుల హక్కులను హరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, 8 గంటల పనిదినం స్థానంలో 12 గంటల పనిదినాన్ని అమలు చేయాలనే కుట్రను కార్మికులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 12 సమ్మెలో అన్ని రంగాల కార్మికులు, ప్రజలు పాల్గొని సంఘీభావం తెలపాలని కోరారు.ఈ కార్యక్రమం లో సీఐటీయూ సీనియర్ నాయకులు వి. విజయ్ కుమార్ ప్రసంగించి వందన సమర్పణ చేశారు.సీఐటీయూ నాయకురాలు రాములమ్మ, మాతమ్మ, నాగమ్మ, నవనీత, కనకమ్మ, అనితలతో పాటు రవాణా రంగ, మున్సిపల్, భవన నిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే జారె భరోసా

- **తక్షణ ఆర్థిక సహాయం అందజేత**

**అశ్వారావుపేట, ఫిబ్రవరి 8 (తెలంగాణ ముచ్చట్లు):**

అశ్వారావుపేట మండలం నారంవారి గూడెం కాలనీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సంభవించిన అగ్ని ప్రమాదంలో యలమర్తి రమాదేవి భర్త కోటేశ్వరరావుకు చెందిన రేకుల షెడ్డు పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటన సమాచారం అందుకున్న వెంటనే ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఘటనాస్థలాన్ని సందర్శించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే, తక్షణ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వం తరఫున అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. అలాగే బాధిత కుటుంబానికి త్వరలోనే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అగ్ని ప్రమాదంతో సర్వం కోల్పోయిన కుటుంబానికి అండగా నిలుస్తామని, అవసరమైన సహాయ చర్యలను వేగంగా చేపడతామని ఎమ్మెల్యే తెలిపారు.



# వ్యూహకర్త.. విశ్వసనీయతకు నిలువెత్తు సాక్ష్యం!

- **"దయన్నకు చెబితే మంత్రికి చేరినట్టే.. పని జరిగినట్టే**
- **ఈనెల 10న పొంగులేటి 'మహాబలం' తుంబూరు దయాకర్ రెడ్డి జన్మదినం**
- **సమస్య ఏదైనా.. దయన్నే పరిష్కార వేదిక..**

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 8(తెలంగాణ ముచ్చట్లు)**







ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయ పటంలో ఆయనొక అజేయ శక్తి. ప్రతి పల్లెకూ ఆయన పేరు ఒక భరోసా. వ్యూహం ఆయన ఇంటి పేరు.. నమ్మకం ఆయన నైజం. తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డికి కవచంలా, ఆయన రాజకీయ సామ్రాజ్యానికి అపర చాణక్యుడిలా నిలుస్తున్న తుంబూరు దయాకర్ రెడ్డి జన్మదినం ఈ నెల 10వ తేదీ సందర్భంగా ప్రత్యేక కథనం.

**నమ్మకానికి మారుపేరు.. పొంగులేటి వెన్నంటే...**

బంధుత్వంలో మేనల్లుడే అయినా, బాధ్యతలో పొంగులేటి శ్రీనివాస రెడ్డికి నిలువెత్తు అండగా నిలిచారు దయాకర్ రెడ్డి. 2013లో పొంగులేటి రాజకీయ ప్రస్థానం మొదలైన నాటి నుండి కష్టకాలంలో నీడలా, విజయాల్లో తోడుగా ఉంటూ ఒక అచంచలమైన శక్తిగా ఎదిగారు. 2019లో పొంగులేటికి ఎంపీ టికెట్ దక్కకపోయినా, ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో ఆయన ప్రాభవం తగ్గకుండా క్షేత్రస్థాయిలో కేడర్ ను సమన్వయం చేయడంలో దయాకర్ రెడ్డి చూపిన చొరవ అసాధారణం. ఏ పార్టీలో ఉన్నా పొంగులేటి మాటే శిరోధార్యంగా భావించే దయాకర్ రెడ్డి, నేడు మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి గా ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో అత్యంత కీలక వ్యక్తిగా చక్రం తిప్పుతున్నారు.

**ఆత్మీయ సమరం.. విజయానికి వారధి...**

గత ప్రభుత్వ హయాంలో పొంగులేటి శ్రీనివాస రెడ్డి నిర్వహించిన 'ఆత్మీయ సమ్మేళనాలు' ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయ చరిత్రను మలుపు తిప్పాయి. పొంగులేటి పిలుపునిచ్చిన ఈ సమ్మేళనాలను విజయవంతం చేయడంలో దయాకర్ రెడ్డి పాత్ర అమోఘం. ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాల్లో ఏ చిన్న పల్లెను అడిగినా అక్కడి రాజకీయ సమీకరణాలు ఆయనకు అరచేతిలో వెన్నపూసలా సుస్పష్టం. ఏ మండలంలో ఎవరికి ఎంత పట్టుంది, ఎవరిని ఎప్పుడు చేరదీయాలి అనే విషయాల్లో ఆయన వేసిన పక్కా ప్లానింగ్ వల్లే ఆ సమ్మేళనాలు ప్రభంజనాన్ని సృష్టించాయి. అధికారుల అడ్డంకులు, రాజకీయ ఒత్తిళ్లను చాకచక్యంగా దాటుకుంటూ ఊరూరా పొంగులేటి వర్గాన్ని ఏకం చేయడంలో దయన్న చూపిన కార్యదక్షత అద్వితీయం.

**సమస్య ఏదైనా.. దయన్నే పరిష్కార వేదిక...**

సామాన్య కార్యకర్త నుంచి ప్రజల వరకు ఎవరికి ఏ కష్టం వచ్చినా గుర్తొచ్చే మొదటి పేరు దయాకర్ రెడ్డి. మంత్రి పొంగులేటి దృష్టికి ఏ విషయాన్ని తీసుకెళ్లాలన్నా ఆయనే ఒక బలమైన వారధి. సమస్య చిన్నదైనా, పెద్దదైనా ఓపికగా విని, దాన్ని మంత్రి దగ్గరకు చేర్చి పరిష్కారం అయ్యే వరకు వెన్నంటే ఉండి భరోసా కల్పించడం ఆయన ప్రత్యేకత. "దయన్నకు చెబితే మంత్రికి చేరినట్టే.. పని జరిగినట్టే" అనే నమ్మకాన్ని ప్రజల్లో కలిగించారు. పాలేరు పట్టాభిషేకంలో కీలక పాత్ర పోషించిన ఆయన, నేడు అధికారానికి, సామాన్యుడికి మధ్య ఒక గట్టి వంతెనలా నిలుస్తున్నారు. అందుకే ఈ నెల 10న దయాకర్ రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆయన అభిమానులు, పొంగులేటి అభిమానులు పండుగలా వేడుకలను నిర్వహించేందుకు సిద్ధమయ్యారు.

# అశ్వారావుపేట వార్డుల్లో బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

- **అభ్యర్థుల గెలుపుకు మెచ్చా నాగేశ్వరరావు, సోయం వీరభద్రం కలిసి ప్రచారం**

**అశ్వారావుపేట, ఫిబ్రవరి 8 (తెలంగాణ ముచ్చట్లు):**





అశ్వారావుపేట మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ప్రచారం జోరుగా కొనసాగుతోంది. పలు వార్డుల బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ మెచ్చా నాగేశ్వరరావుతో కలిసి జిల్లా బీఆర్ఎస్ పార్టీ నాయకులు సోయం వీరభద్రం విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సోయం వీరభద్రం మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల వేళ అధికార కాంగ్రెస్ పార్టీ అమలు కాని హామీలను మళ్లీ ప్రజల ముందుకు తీసుకొస్తోందని విమర్శించారు. ఎన్నికలు వచ్చినప్పుడే కోట్లు నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యేలు, మంత్రులు చెప్పడం ప్రజలను మభ్యపెట్టడమేనని అన్నారు. అశ్వారావుపేటలో నిజంగా అభివృద్ధి జరిగి ఉంటే ప్రతి గడపకు వెళ్లి ఓట్లు అడగాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. కాలికి బలపం కట్టి కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేయాల్సి వస్తోందంటే ప్రజలే తగిన సమాధానం ఇస్తారని వ్యాఖ్యానించారు. ఆదివారం అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంలో 9వ వార్డు అభ్యర్థి ఉకే సుమలత, 4వ వార్డు అభ్యర్థి జీల్ల శ్రీదేవి, 2వ వార్డు అభ్యర్థి నీలం రత్నవేణి, 10వ వార్డు అభ్యర్థి కోటగిరి కిషోర్ గెలుపు కోసం మెచ్చా నాగేశ్వరరావు, సోయం వీరభద్రం కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుపై అమూల్యమైన ఓటు వేసి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శాంతినగర్ అంబేద్కర్ సర్కిల్లో పంజా విసిరిన లయన్

- **తెలంగాణ ముచ్చట్లు జోగులాంబ గద్వాల జిల్లా**






మున్సిపల్ ఎన్నికల్లో ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థులను.గెలిపించాలని మాజీ జెడ్పిటిసి శ్రీనివాసులు వడ్డేపల్లి మున్సిపాలిటీ అభ్యర్థిని అజయ్ కుమార్ ని తొమ్మిదవ వ వార్డు నెంబర్ గా పోటీ చేస్తున్నటువంటి శాంతినగర్ అంబేద్కర్ సర్కిల్ మాట్లాడిన మాజీ జెడ్పిటిసి వడ్డేపల్లి శ్రీనివాసులు యూత్ పార్టీ నాయకుడు యుగేందర్ రెడ్డి ఐదవ వార్డు అభ్యర్థి వడ్డేపల్లి మున్సిపాలిటీ కేంద్రమైన శాంతినగర్ యందు ఈ సాయంత్రం జరిగిన ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (AIFB) సంబంధించిన మీటింగు జరిగింది కావున కార్యక్రమానికి వేలాది మంది ప్రజలు పైపాడు, వడ్డేపల్లి, శాంతినగర్ నుంచి తరలి రావడం జరిగినది. సందర్భంగా తొమ్మిది వార్డుల నుంచి పోటీ చేయుచున్నటువంటి అభ్యర్థులు మరియు వడ్డేపల్లి పైపాడు ప్రజలను ఉదేశించి ప్రసంగించడం జరిగినది. గత పాలకులు చేసిన లోపాలను.ఎత్తుచూపుతూ రాబోయే రోజులలోమునిసిపాలిటీని ఏ విధంగా అభివృద్ధి చేసేది ప్రజలకు స్పష్టంగా వివరించడం జరిగినది. ఆ విషయాన్ని ఈ ఇట్టి కార్యక్రమంలో పైపాడు మధుసూదన్ రెడ్డి వడ్డేపల్లి లక్ష్మిరెడ్డి తదితరులు ప్రజలు ర్యాలీ సభలో పాల్గొన్నారు.

# సామాజిక సేవలో జర్నలిస్టులు ముందుండాలి

- **ఉప్పల్ ప్రెస్ క్లబ్ నూతన కమిటీని అభినందించిన టియూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ**

**హైదరాబాద్,ఫిబ్రవరి08(తెలంగాణ ముచ్చట్లు):**





సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడంలో జర్నలిస్టులు ముందుండాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ పేర్కొన్నారు. ఆదివారం టీయూడబ్ల్యూజే రాష్ట్ర కోశాధికారి మోతె వెంకట్ రెడ్డి, మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దొంతుల వెంకట్ రామ్ రెడ్డి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసిన ఉప్పల్ ప్రెస్ క్లబ్ నూతన కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులు తమ సంక్షేమ కార్యక్రమాలతో పాటు సామాజిక రుగ్మతులపై వివిధ ప్రజా సంఘాలతో కలుపుకొని ప్రజా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. జర్నలిజంలో నానాటికి పెరిగిపోతున్న పెడ ధోరణులను అరికట్టి, జర్నలిజం విలువలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి జర్నలిస్టుపై ఉందన్నారు. జర్నలిస్టుల పక్షాన టీయూడబ్ల్యూజే నిరంతరం పోరాటం సలుపుతుందని ఆయన అన్నారు. ఈకార్యక్రమంలో ఉప్పల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల తిరుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి గ్యరంపల్లి శివాజీ, వర్కింగ్ ప్రెసిడెంట్ పారేల్లి సాగర్, ఉపాధ్యక్షులు ఏవి శ్రీధర్ రావు, కూకుట్ల నరోత్తం రెడ్డి, కోశాధికారి గుత్తి శేఖర్, జాయింట్ సెక్రటరీ దాస రాజు మరియు సలహాదారులు కొలను పాక చంద్రమౌళి, కోడికంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# నేడు విద్యుత్ పలు ప్రాంతాల్లో సరఫరా నిలిపివేత

- **పీఎంఐ నిర్వహణ పనుల కారణంగా విద్యుత్ అంతరాయం**

**కీసర / అంకిరెడ్డిపల్లి, ఫిబ్రవరి 08 (తెలంగాణ ముచ్చట్లు):**

ఎస్ఎస్ నిర్వహణ, కొత్త సర్వీస్ విడుదల, డీసీ పనులు మరియు పలు ఫీడర్లపై పీఎంఐ (పిఎంఐ) నిర్వహణ పనుల కారణంగా నేడు కీసర, అంకిరెడ్డిపల్లి, యాద్గార్‌పల్లి పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ ఎస్. మురళీ కృష్ణ తెలిపారు.అంకిరెడ్డిపల్లి సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు 11 కేవీ సాల్వో ఎక్స్‌ప్లోజివ్ ఫీడర్ పరిధిలో సాల్వో ఎక్స్‌ప్లోజివ్, బాలాజీ మెటల్, జైరామ్ రెడ్డి మెటల్, జైదేవ్ కాంక్రీట్, క్రషర్స్ కంపెనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. అదేవిధంగా 11 కేవీ తాతా హాస్పిటల్ ఫీడర్, 11 కేవీ పెద్దమ్మ చెరువు ఫీడర్ పరిధిలో అంకిరెడ్డిపల్లి గ్రామం, అంకిరెడ్డిపల్లి చౌరస్తా, తాతా హాస్పిటల్, వాయుపురి వెంచర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.కీసర సబ్ స్టేషన్ నుండి 11 కేవీ అంకిరెడ్డిపల్లి ఫీడర్ పరిధిలో అంకిరెడ్డిపల్లి, శివాజీ నగర్, కీసర గుట్ట రోడ్, సినిమా థియేటర్, మల్లికార్జున నగర్, విఆర్ఆర్ వెంచర్, లలిత ఫంక్షన్ హాల్, రిజిస్టర్ ఆఫీస్, చంద్రగిరి కాలనీ, కీసర గ్రామం ఏజీఎల్ ప్రాంతాల్లో కూడా ఇదే సమయంలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే యాద్గార్‌పల్లి సబ్ స్టేషన్ నుండి 11 కేవీ తిమ్మాపల్లి ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తిమ్మాపల్లి గ్రామం, నర్సంపల్లి, ధర్మారం గ్రామం, ఏజీఎల్ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు.విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని, తాత్కాలిక అసౌకర్యానికి చింతిస్తున్నామని ఏఈ ఎస్. మురళీ కృష్ణ విజ్ఞప్తి చేశారు.



## ముంథా తుఫాన్ దెబ్బకు వేములపల్లి–కొండాపూర్
# ప్రధాన రహదారి ధ్వంసం

**వేలేరు,ఫిబ్రవరి08(తెలంగాణ ముచ్చట్లు):**

వేలేరు మండలం పరిధిలోని వేములపల్లి గ్రామం సమీపంలో ఇటీవల విరుచుకుపడ్డ ముంథా తుఫాన్ ప్రభావంతో వేములపల్లి నుంచి కొండాపూర్కు వెళ్లే ప్రధాన రహదారి తీవ్రంగా దెబ్బతింది. తుఫాన్ కారణంగా రహదారి పూర్తిగా కొట్టుకుపోవడంతో గ్రామస్తులు, వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రహదారి దెబ్బతినడం వల్ల పాఠశాల విద్యార్థులు, రైతులు, అత్యవసర అవసరాల కోసం ప్రయాణించే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు చర్యలు కనిపించడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే రహదారి మరమ్మతులు చేపట్టి రాకపోకలను పునరుద్ధరించాలని వేములపల్లి గ్రామ ప్రజలు కోరుతున్నారు.



# ఈటల రాజేందర్‌కు స్వాగతం పలికిన నాయకులు

**స్టేషన్ ఘనపూర్, ఫిబ్రవరి08 (తెలంగాణ ముచ్చట్లు):**

జనగాం జిల్లా స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ పరిధిలో కౌన్సిలర్ అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు వచ్చిన మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ కు చాగల్లు గ్రామంలో బీజేపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా ఎన్నికల ఇన్‌చార్జ్ దొంతి దేవేందర్ రెడ్డి, బీజేపీ జనగాం జిల్లా అధ్యక్షుడు సౌడ రమేష్, ఏడవ వార్డు ఎన్నికల ఇన్‌చార్జ్, చిల్పూర్ మండల అధ్యక్షుడు గంటె ఉపేందర్ యాదవ్, చిల్పూర్ మండల ప్రధాన కార్యదర్శి వెలిశాల శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే ఏడవ వార్డు అభ్యర్థి బూర్ల స్వాతి, ఎనిమిదవ వార్డు అభ్యర్థి బూర్ల కుమార్, తొమ్మిదవ వార్డు అభ్యర్థి భాస్కులా రాజేందర్‌తో పాటు బూత్ అధ్యక్షులు, జిల్లా, మండల స్థాయి నాయకులు, బీజేపీ కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ పరిధిలో బీజేపీ అభ్యర్థుల విజయానికి సమిష్టిగా కృషి చేయాలని నాయకులు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.



# కూలిన ప్రైవేట్ శిక్షణ విమానం.. కెప్టెన్, ట్రైనీ పైలట్‌కు గాయాలు

- ఇంజిన్‌లో సాంకేతిక లోపంతో ప్రమాదం
- పొలంలో కూలిన విమానం
- దర్యాప్తు చేపట్టిన ఏవియేషన్ అధికారులు

**బెంగళూరు, ఫిబ్రవరి 8, 2026 (తెలంగాణ ముచ్చట్లు):**

కర్ణాటక రాష్ట్రంలోని విజయపుర జిల్లాలో ప్రైవేట్ శిక్షణ విమానం ప్రమాదానికి గురైంది. విమానం ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో అది కూలిపోయింది. ఈ ప్రమాదంలో విమానంలోని కెప్టెన్, ట్రైనీ పైలట్ గాయపడ్డారు. వారిని వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆదివారం రెడ్ బర్డ్ ఏవియేషన్‌కు చెందిన ప్రైవేట్ శిక్షణ విమానం కలబురగి నుంచి బెళగావికి వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఆకాశంలో ఎగురుతున్న సమయంలో ఇంజిన్‌లో అకస్మాత్తుగా సమస్య ఏర్పడినట్లు ప్రాథమిక సమాచారం. ఇంజిన్‌లో లోపం తలెత్తిన వెంటనే పైలట్లు విమానాన్ని నియంత్రించేందుకు ప్రయత్నించినప్పటికీ, విజయపుర జిల్లా మంగళూరు గ్రామ పరిధిలోని పొలంలో విమానం కూలిపోయింది. ఈ ఘటనలో కెప్టెన్, ట్రైనీ పైలట్‌కు గాయాలు కాగా, స్థానికులు సమాచారం ఇవ్వడంతో అంబులెన్స్‌లో వారిని సమీప ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటన బాబలేశ్వర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకోగా, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదానికి గల కారణాలపై ఏవియేషన్ అధికారులు దర్యాప్తు చేపట్టారు. విమాన భద్రత, సాంకేతిక లోపాలపై సమగ్రంగా విచారణ కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.

# సిసి రోడ్డు పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

- కాలనీ సమస్యల పరిష్కారానికి హామీ

**నాచారం, ఫిబ్రవరి 08 (తెలంగాణ ముచ్చట్లు):**



ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ మీర్పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్ కాలనీ ఫేజ్-2లో సిసి రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని రోడ్డు పనులను ప్రారంభించారు .ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రభుదాస్, డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, వంజరి ప్రవీణ్, కాలనీ అధ్యక్షుడు సతీష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి హరి ప్రసాద్, కోశాధికారి జనార్దన్, రంగారెడ్డి, అలీముద్దీన్, శ్రీనివాస్ రెడ్డి, ప్రకాష్‌తో పాటు కాలనీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, వీధిదీపాల వంటి పలు సమస్యలను కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కాలనీలోని అన్ని సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సిసి రోడ్డు నిర్మాణంతో కాలనీవాసులకు శాశ్వత ప్రయోజనం చేకూరుతుందని ఆయన తెలిపారు.

# సేవాలాల్ జయంతి సందర్భంగా కేయూలో క్రీడా పోటీలు ప్రారంభం

**హన్మకొండ,ఫిబ్రవరి08(తెలంగాణ ముచ్చట్లు):**



సేవాలాల్ మహారాజ్ 287వ జయంతిని పురస్కరించుకొని కాకతీయ యూనివర్సిటీలో బంజారా గిరిజన విద్యార్థుల ఆధ్వర్యంలో సేవాలాల్ సేన క్రికెట్ టోర్నమెంట్, అథ్లెటిక్స్ పోటీలను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య ప్రతాప్ రెడ్డి క్రీడలను ప్రారంభించారు. బంజారా గిరిజన విద్యార్థులు విద్యతో పాటు శారీరక దృఢత్వం, వ్యాయామం, క్రీడల ద్వారా సోదర భావాన్ని పెంపొందించుకొని సేవాలాల్ ఆశయ సాధన కోసం కృషి చేయాలని సూచించారు. సేవాలాల్ జయంతిని పురస్కరించుకొని ఇంత పెద్ద స్థాయిలో క్రీడా పోటీలను నిర్వహించడం అభినందనీయమని, దీనిలో బంజారా విద్యార్థులు చూపుతున్న ఉత్సాహం ప్రశంసనీయమని పేర్కొన్నారు.

యూనివర్సిటీలోని వివిధ విభాగాల్లో చదువుతున్న విద్యార్థులు ఈ టోర్నమెంట్లలో పాల్గొని క్రీడలను విజయవంతం చేయాలని, విద్యతో పాటు విజ్ఞానం, క్రీడాస్ఫూర్తి, సోదర భావం పెంపొందించుకోవాలని ఎస్‌డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ సురేష్ లాల్, సైన్స్ డీన్ ప్రొఫెసర్ హనుమంతు అన్నారు.

దాదాపు 32 విభాగాలకు చెందిన విద్యార్థులు, గిరిజన సంఘాల నాయకులు, సేవాలాల్ సేన సభ్యులు, ఇతర వర్గాల విద్యార్థులు ఈ క్రీడా పోటీల్లో పాల్గొనడం సంతోషకరమని నిర్వాహకులు తెలిపారు. ప్రతి సంవత్సరం సేవాలాల్ జయంతిని ఈ స్థాయిలో నిర్వహించడం రాష్ట్రవ్యాప్తంగా బంజారా యువతకు ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించిన యూనివర్సిటీ బంజారా విద్యార్థులను, ముఖ్యంగా అశోక్ నాయక్‌తో పాటు అతని మిత్రులను కంటెస్టెడ్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ డా. రాజు నాయక్, స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ ప్రొఫెసర్ వెంకయ్య అభినందించారు.ఈ కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగం ప్రొఫెసర్ రమేష్ నాయక్, లైబ్రరీ ఇంచార్జ్ జవహర్, ప్రొఫెసర్ ఈసం నారాయణ, హనుమకొండ సేవాలాల్ సేన అధ్యక్షుడు మురళి నాయక్, సేవాలాల్ విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు సంతోష్ నాయక్‌తో పాటు యూనివర్సిటీ విద్యార్థులు పవన్ నాయక్, శ్రీను, వెంకన్న, సచిన్, శ్రీకాంత్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ లు..బంజారా సంస్కృతిని.. ప్రపంచానికి చాటి చెప్పాలి

- తెలంగాణ గోర్ సిక్వాడి రాష్ట్ర అధ్యక్షులు బానోతు వెంకన్న నాయక్..
- గోర్ సేన, గోర్ సిక్వాడి ఆధ్వర్యంలో నూతన సర్పంచులకు ఘన సన్మానం..

**న్యూ శాయంపేట, ఫిబ్రవరి08 (తెలంగాణ ముచ్చట్లు):**



ఇటీవల నూతనంగా ఎన్నుకోబడిన సర్పంచ్ ఉప సర్పంచ్లు గోర్ సంస్కృతి సంప్రదాయాలను కాపాడే విధంగా పనిచేస్తూ.. జాతి చరిత్రను ప్రపంచానికి చాటేలా ఉండాలని గోర్ సిక్వాడి రాష్ట్ర అధ్యక్షులు బానోతు వెంకన్న నాయక్ అన్నారు. ఆదివారం హనుమకొండ హంటర్ రోడ్ లోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్ లో.. ఇటీవల వరంగల్ జిల్లాలో ఎన్నికైబడిన సర్పంచ్ లు 121 మంది ని, ఉపసర్పంచ్,కార్యదర్శులను ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోర్ బంజారా కు చెందిన సర్పంచ్ ఉప సర్పంచ్లు బంజారా జాతిని.. మన సంస్కృతి సంప్రదాయాలను.. ప్రపంచానికి చాటిని చెప్పాలా కృషి చేయాలి అన్నారు. ఐదేళ్లపాటు.. సర్పంచ్ లే గ్రామ మొదటి పౌరులని.. అధికారుల సహాయంతో.. తండాలను గుడాలను అభివృద్ధి చేసుకోవాలని, సంస్కృతి సాంప్రదాయాలను మర్చిపోకుండా తండాలలో.. సేవాలాల్ మహారాజ్ జయంతి, శీతల పండుగ తీజ్ పండుగలను ఘనంగా నిర్వహించాలని.. సెలవు తెలంగాణ రాష్ట్రంలో సేవాలాల్ జయంతిని పురస్కరించుకొని సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హేసాభి హట్య నాయక్, రాయిసిన అధ్యక్షులు మల్సూర్ నాయక్, విచారి దళ్ అధ్యక్షులు పరశురాం, మీడియా వింగ్ అధ్యక్షులు బాదావత్ బాలాజీ నాయక్, గోర్ సిక్వాడి ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ నుండి రాము నాయక్, రాగ్య నాయక్, వాలియా నాయక్ మహేశ్వర రాథోడ్, గోర్ సేన ఉమ్మడి జిల్లా అధ్యక్షులు చిట్టిబాబు నాయక్, వరంగల్ జిల్లా అధ్యక్షులు మహేందర్ నాయక్, రామ్ దాన్ నాయక్,మాలోతు నాను నాయక్, బానోతు వెంకన్న నాయక్ కార్యదర్శులు యాకుబ్ నాయక్,సాయిరాం, ధర్మాణి బాయి కమిటీ, రాణి బాయి, సోనాబాయి, స్వర్ణభాయి సర్పంచులు ఉప సర్పంచ్లు కార్యదర్శిలు తదితరులు పాల్గొన్నారు





## నాగార్జునసాగర్ విద్యా పర్యటనతో
# విద్యార్థుల్లో అనుభవాత్మక అభ్యాసం

**ధర్మసాగర్,ఫిబ్రవరి08(తెలంగాణ ముచ్చట్లు):**

విద్యను పాఠ్యపుస్తకాలకే పరిమితం చేయకుండా అనుభవాత్మకంగా, సమగ్రంగా అందించాలనే లక్ష్యంతో ధర్మసాగర్ జెడ్పిహెచ్ఎస్ బాలుర పాఠశాల, ఎంపీపీఎస్ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు కలిసి **నాగార్జునసాగర్ - నాగార్జునకొండ**లకు విద్యా పర్యటన నిర్వహించారు.

ఈ పర్యటన ద్వారా విద్యార్థులు ఈ ప్రాంతాన్ని పాలించిన రాజవంశాల చరిత్రను ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం పొందారు. నాగార్జునకొండ పురావస్తు సంగ్రహాలయంలో ప్రదర్శించబడిన శాసనాలు, శిల్పాలు, పురాతన వస్తువులను పరిశీలించడం ద్వారా బౌద్ధ యుగం, అప్పటి సామాజిక జీవనం, సాంస్కృతిక వైభవంపై స్పష్టమైన అవగాహన ఏర్పడింది. తరగతి గదిలో నేర్చుకున్న పాఠాలకు ఇది ప్రత్యక్ష అనుసంధానంగా నిలిచింది.

నాగార్జునసాగర్ ఆనకట్ట సందర్శన ద్వారా జలవనరుల నిర్వహణ, నదీ పరివాహక ప్రాజెక్టుల ప్రాధాన్యత, వ్యవసాయంతో పాటు ఆర్థిక అభివృద్ధిలో వాటి పాత్రను విద్యార్థులు అర్థం చేసుకున్నారు. లాంచ్ ప్రయాణం సందర్భంగా కృష్ణా నది పరిసరాల ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ పర్యావరణ సమతుల్యతపై అవగాహన పెంచుకున్నారు.

విద్యతో పాటు సామాజిక అనుబంధం, సాంస్కృతిక వ్యక్తీకరణ, ఆనందభరిత అభ్యాసం కూడా ఈ పర్యటన ప్రత్యేకతగా నిలిచాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి పాటలు పాడటం, నృత్యాల్లో పాల్గొనడం ద్వారా ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. బుద్ధవనంలో నిర్వహించిన సంయుక్త భోజనం ఐక్యత, సహకారం భావాలను మరింత బలపరిచింది.

ఈ విద్యా పర్యటనను ప్రధానోపాధ్యాయుడు కె.బి. ధర్మప్రకాశ్ నేతృత్వంలో, పర్యటన సమన్వయకర్త రాజమ్మ సమర్థవంతంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు కవితా దేవి, సురేష్, కిరణ్మయీ, ప్రసన్న, సురేష్ సంపూర్ణ సహకారం అందించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ మమతతో పాటు ఉపసిబ్బంది అజ్మీరి బేగం, పూలమ్మ, శ్యామల, రాధలు కీలక పాత్ర పోషించారు. మొత్తం 52 మంది విద్యార్థులు ఈ పర్యటనలో పాల్గొన్నారు.ఈ విద్యా పర్యటన విద్యార్థులకు మరిచిపోలేని అనుభూతిగా నిలిచి, పాఠ్యపుస్తకాలకు అతీతంగా నేర్చుకునే విధానానికి బలమైన ప్రోత్సాహంగా మారింది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# తండ్రి గెలుపు కోసం కూతుర్ల ఇంటింటి ప్రచారం

**చిన్నారుల చిరునవ్వుల్లో ఓ గెలుపు ఆశ**
**స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారాల్లో ప్రత్యేక ఆకర్షణగా క్యూటీ,స్మార్టీ**
**13 వ వార్డు స్వతంత్ర అభ్యర్థి రడపాక ఆరోగ్యం కూతుర్ల ప్రచారం**



**స్టేషన్ ఘనపూర్, ఫిబ్రవరి08 (తెలంగాణ ముచ్చట్లు):** మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారం అంటే పెద్ద పెద్ద మాటలు, రాజకీయ నినాదాలే అన్న అభిప్రాయానికి భిన్నంగా, స్టేషన్ ఘనపూర్‌లో ఓ హృదయాన్ని తాకే దృశ్యం కనిపించింది. స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు స్వతంత్ర అభ్యర్థి రడపాక ఆరోగ్యం గెలుపు కోసం ఆయన తనయురాళ్లు క్యూటీ(09), స్మార్టీ(08) స్వయంగా ప్రచార రంగంలోకి దిగారు.ఇంటి ఇంటికి వెళ్లి తమ తండ్రి ఎన్నికల మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేస్తూ, ఓటర్లతో మమేకమవుతూ వారు నిర్వహించిన ప్రచారం అందరి దృష్టిని ఆకర్షించింది. రాజకీయ వ్యూహాలకన్నా ఆత్మీయతే ప్రధానంగా సాగిన ఈ ప్రచారంలో చిన్నారుల చిరునవ్వులు, అమాయకమైన మాటలు ప్రజల హృదయాలను తాకాయి. "మా నాన్నను గెలిపించండి" అనే వారి మాటల్లో ఎలాంటి కృత్రిమత లేకుండా సహజమైన నమ్మకం కనిపించింది. వార్డు సమస్యలపై పెద్ద పెద్ద హామీలు కాకుండా, నిజాయితీగా ప్రజల దగ్గరకు వెళ్లే ప్రయత్నమే ఈ ప్రచారానికి ప్రత్యేకతగా నిలిచింది. చిన్నారుల ఉత్సాహం, ఆత్మవిశ్వాసం ప్రచారానికి కొత్త రంగు అద్దింది.

ప్రచారంలో భాగంగా ఎదురైన ప్రతి ఇంట్లోనూ క్యూటీ, స్మార్టీలకు ఆప్యాయ స్వాగతమే లభించింది. కొందరు ఓటర్లు వారి తల నిమిరుతూ ఆశీర్వదించగా, మరికొందరు ఈ ప్రచారం రాజకీయాల్లో అరుదైన మానవీయ స్పర్శను చూపిస్తోందని అభిప్రాయపడ్డారు.ఈ ఎన్నికల్లో గెలుపు ఓటుతో మాత్రమే కాకుండా ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకోవడమే అసలైన విజయమని చాటేలా సాగిన ఈ ప్రచారం, స్టేషన్ ఘనపూర్ రాజకీయ వాతావరణంలో ఒక మధురమైన గుర్తుగా నిలిచింది. చిన్నారుల భాగస్వామ్యంతో సాగిన ఈ ప్రయత్నం, ఎన్నికల ప్రచారానికి కొత్త అర్థాన్ని చెప్పింది.

# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి

- బిఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బోరెల్లి సురేష్



**హైదరాబాద్,ఫిబ్రవరి08( తెలంగాణ ముచ్చట్లు):** కొల్లాపూర్ పట్టణ అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బోరెల్లి సురేష్ పిలుపునిచ్చారు. అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని కింది వర్గాల వరకు తీసుకెళ్తున్న ప్రజా ప్రభుత్వాన్ని ప్రతి ఒక్కరూ బలపరచాల్సిన అవసరం ఉందన్నారు.కొల్లాపూర్ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ నాయకత్వం కీలకంగా పనిచేస్తోందని పేర్కొన్న ఆయన, పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించడం ద్వారా పట్టణ అభివృద్ధికి ప్రజలు భాగస్వాములవ్వాలని కోరారు. సామాన్యులకు ప్రాధాన్యం ఇచ్చి టికెట్లు కేటాయించడం, ప్రజల కోసం నిరంతరం పనిచేయడం ద్వారా పార్టీ తన నిబద్ధతను చాటుతోందని అన్నారు. పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు తగిన ప్రాధాన్యం కల్పించే దిశగా కాంగ్రెస్ ముందుకెళ్తోందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పేదలకు ఇళ్ల మంజూరులో నిర్లక్ష్యం జరిగిందని విమర్శించిన ఆయన, అనేక మంది పేదలు ఇల్లు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కులం, మతం, ఆర్థిక స్థితి తేడా లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని చెప్పారు. అదే విధంగా అనేక సంక్షేమ పథకాలు అమలవుతూ క్షేత్రస్థాయిలో ఫలితాలు కనిపించడం సంతోషకరమని పేర్కొన్నారు.

# కేంద్ర–రాష్ట్రాల మధ్య విభేదాలు

- అభివృద్ధికి అడ్డంకులా? రాజకీయ ప్రతిష్టల పోరా?
- ప్రజలపై పడుతున్న ప్రభావం
- నిధుల పంపిణీపై పెరుగుతున్న అసంతృప్తి



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8 (తెలంగాణ ముచ్చట్లు):** దేశంలో కేంద్ర-రాష్ట్రాల మధ్య విభేదాలకు ప్రధాన కారణంగా నిధుల పంపిణీ అంశం నిలుస్తోంది. పన్నుల వాటా, ప్రత్యేక గ్రాంట్లు, కేంద్ర సహాయ నిధుల విషయంలో అనేక రాష్ట్రాలు తమకు న్యాయం జరగడం లేదని ఆరోపిస్తున్నాయి. అభివృద్ధి పనులకు కావాల్సిన నిధులు సకాలంలో అందకపోవడం వల్ల పథకాల అమలు ఆలస్యమవుతోందని రాష్ట్ర ప్రభుత్వాలు వాపోతున్నాయి. మరోవైపు కేంద్రం మాత్రం జాతీయ అవసరాల దృష్ట్యా నిర్ణయాలు తీసుకుంటున్నామని చెబుతోంది.

**పథకాల అమలులో సమన్వయ లోపం**

కేంద్రం ప్రకటించే సంక్షేమ, అభివృద్ధి పథకాలు రాష్ట్రాల అవసరాలకు పూర్తిగా అనుగుణంగా ఉండడం లేదన్న వాదన బలంగా వినిపిస్తోంది. రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా రూపొందించిన విధానాలు అమలులో ఆటంకాలకు దారి తీస్తున్నాయి. ఫలితంగా ప్రజలకు అందాల్సిన ప్రయోజనాలు ఆలస్యం అవుతున్నాయి. ఈ సమన్వయ లోపం అభివృద్ధి వేగాన్ని తగ్గిస్తోంది.

**- రాజకీయ భేదాలతో పెరుగుతున్న ఉద్రిక్తత**

కేంద్రంలో ఒక పార్టీ, రాష్ట్రాల్లో వేరే పార్టీలు అధికారంలో ఉన్న చోట ఈ విభేదాలు మరింత తీవ్రమవుతున్నాయి. అభివృద్ధి అంశాలు రాజకీయ ఆరోపణల మధ్య చిక్కుకుని, పరస్పర విమర్శలకే పరిమితమవుతున్నాయి. ప్రజా ప్రయోజనాల కంటే రాజకీయ ప్రతిష్టలకే ఎక్కువ ప్రాధాన్యం దక్కుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇది సమాఖ్య వ్యవస్థ స్ఫూర్తికి విరుద్ధంగా మారుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

కేంద్ర-రాష్ట్రాల మధ్య సమన్వయం లోపిస్తే దాని ప్రభావం నేరుగా సామాన్య ప్రజలపైనే పడుతుంది. మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు ఆలస్యం కావడం వల్ల ప్రజలు నష్టపోతున్నారు. దేశవ్యాప్తంగా సమతుల్య అభివృద్ధి సాధించాలంటే కేంద్రం-రాష్ట్రాలు పరస్పర గౌరవం, సహకారంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. రాజకీయ విభేదాల కంటే జాతీయ ప్రయోజనాలే ముందుండినప్పుడే దేశ అభివృద్ధి సాధ్యమవుతుంది.

# ఏ కులపాడివిరా..?

ఏ కులపోడివి రా నువ్వు?
"దళితుడినయ్యా."
దేంట్లో వస్తావ్ అని అడుగుతున్న.
"మీ తిట్లల్లో దొర.
మురికి కాలువలో
వేరు చేయబడ్డ పల్లెంలో నేనొస్తా."

హిందువేమో అనుకున్నారా ?
"అవునండి
హిందువునే
కానీ
కేవలం మీ ఎలక్షన్లప్పుడే."

ఏం తింటావ్ రా నువ్వు?
"దళితుడు తినే తిండేనయ్యా."

కాదురా..
ఏమేం తింటావ్ అని.?
"మీ చేతుల్లో తన్నులు తింటుంటానయ్యా.
అప్పుల భారంలో బతుకుతున్న వాణ్ణి
కొన్నిసార్లు ఉప్పుతో,
కొన్నిసార్లు ఊరగాయలతో తింటానయ్యా."

నేనడిగేది
చికెన్ తింటావా అని.?
"తింటానండి
మీ ఎలక్షన్లప్పుడు."

ఏం తాగుతావ్ మరి.?
"ఏముంటుందయ్యా..
అంతా మీ దయ
ఓ దళితుడేం తాగుతాడో
నేను అదే తాగుతానయ్య."

కాదురా ఎర్రోడా..
ఏమేం తాగుతావ్ అని.?
"అంటరానితనపు దుఃఖన్ని తాగుతాను దొర.
విరిగిపోయిన కలల నొప్పిని
నగ్నపు కళ్ళతో చూసే భ్రమలన్నింటిని
మింగేస్తుంటానయ్యా."

కాదురా
మందేమైన తాగుతావా అని.?
"తాగుతానయ్యా
మీ ఎలక్షన్లప్పుడు."

ఇంతకీ
ఏమైన దొరికిందార నీకు.?
"దొరికిందయ్యా
ఓ దళితుడికేం దొరుకుతాయో
అవన్నీ దొరికాయయ్యా."

కాదురా వారి
జీవితంలో ఏం దొరికింది అని.?
"దొరికిందండి
అవమానకరమైన బతుకు .
మీరు వదిలేసిన మురికి,
మీలాంటి పరాన్నజీవుల దగ్గర
భక్తి శ్రద్దలతో పడుండే జీవితం. "

హామీలేమైనా దొరికాయానని
అడుగుతున్నారా.?
"హ దొరికాయ్ కదండీ
మీ ఎలక్షన్లప్పుడు."

సర్లే.,
ఏంచేసావ్ నువ్వు.?
"ఓ దళితుడేం చేస్తాడో అదే చేసానయ్య."

అది కాదురా.,
ఏమేమ్ పనులు చేసావ్ అని.?
"వంద రోజులు చెరువులో పని చేసా.
చెమట కక్కుతున్న ఉదయాన్ని
సాయంత్రం చేసా.
వచ్చి పోయే ఠాకూర్లందరికి
వంగి వంగి దండాలెట్టినానయ్య."

ఏదైనా పెద్ద పని చేసావేమో అనుకున్నారా.?
"చేశాను కదయ్యా
మీ ఎలక్షన్ల ప్రచారం."



మూలం: బచ్చా లాల్ ఉన్మేష్
స్వేచ్ఛానువాదం: దియా విఘ్నేష్




# స్వర్ణగిరి ఎక్స్‌ప్రెస్‌లో మంటల... పరుగులు తీసిన ప్రయాణికులు

**జైసల్మేర్, ఫిబ్రవరి 8 (తెలంగాణ ముచ్చట్లు):** ఇటీవల వరుస రైలు ప్రమాదాలు ప్రయాణికుల్లో భయాందోళన కలిగిస్తున్న వేళ, తాజాగా స్వర్ణగిరి ఎక్స్‌ప్రెస్లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఆదివారం ఉదయం రాజస్థాన్ రాష్ట్రంలోని జైసల్మేర్ జిల్లా జేతా-చందన్ రైల్వే స్టేషన్ సమీపంలో ఢిల్లీ నుంచి వస్తున్న ఈ రైలులో మంటలు చెలరేగాయి. రైలు ప్రయాణంలో ఉండగా ఒక బోగీలో నుంచి దట్టమైన పొగ రావడం గమనించిన ప్రయాణికులు ఒక్కసారిగా కేకలు వేశారు. సమాచారం అందుకున్న లోకో పైలట్ అప్రమత్తమై వెంటనే రైలును నిలిపివేశారు. రైలు ఆగగానే భయంతో ప్రయాణికులు బోగీల నుంచి బయటకు పరుగులు తీశారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో పాటు రైల్వే అధికారులు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అదృష్టవశాత్తు ఈ ఘటనలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని అధికారులు తెలిపారు. అయితే ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ప్రయాణికులు తీవ్ర భయానికి గురయ్యారు. సాంకేతిక లోపమా, లేక ఇతర కారణాలా అన్న అంశంపై రైల్వే అధికారులు విచారణ చేపట్టారు. ఇటీవల తరచూ రైళ్లలో చోటు చేసుకుంటున్న అగ్నిప్రమాదాల నేపథ్యంలో భద్రతా చర్యలను మరింత కఠినతరం చేయాల్సిన అవసరం ఉందని ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు.

# బంగ్లాదేశ్‌లో హిందువుల హక్కులపై మోహన్ భగవత్ వ్యాఖ్యలు

- హక్కుల కోసం పోరాడితే ప్రపంచ హిందువుల మద్దతు
- బంగ్లాలో హిందువులపై దాడులపై ఆందోళన
- ఆరెస్సెస్ లక్ష్యం సమాజ ఐక్యతే అని స్పష్టం



**ముంబై, ఫిబ్రవరి 8, 2026 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):** బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ కీలక వ్యాఖ్యలు చేశారు. బంగ్లాదేశ్‌లో నివసిస్తున్న సుమారు ఒక కోటి ఇరవై ఐదు లక్షల మంది హిందువులు తమ హక్కుల కోసం సంఘటితంగా పోరాడితే, ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులంతా వారికి మద్దతుగా నిలుస్తారని ఆయన స్పష్టం చేశారు. ఆరెస్సెస్ వందేళ్లు పూర్తైన సందర్భంగా ముంబైలో నిర్వహించిన కార్యక్రమంలో భగవత్ పాల్గొని మాట్లాడారు. కొంతకాలంగా బంగ్లాదేశ్‌లో హిందువులు సహా మైనారిటీలపై హత్యలు, దాడులు, దోపిడీలు జరుగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో అక్కడి హిందువులు భయపడకుండా తమ హక్కుల కోసం పోరాడాలని, అలా చేస్తే ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందూ సమాజం సంఘీభావంగా నిలుస్తుందని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా భారతదేశంలోనూ మైనారిటీలు, జనాభా మార్పులు, అక్రమ వలసల అంశాలపై భగవత్ మాట్లాడారు. గత ప్రభుత్వాలు ఈ సమస్యలను సకాలంలో గుర్తించి స్పందించలేదని విమర్శించారు. కొన్ని వర్గాల్లో అధిక జననాల రేటు, అక్రమ వలసల వల్ల పరిస్థితులు మారాయని, ఇప్పుడు ప్రభుత్వం ఈ అంశాలపై చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ప్రభుత్వ ప్రయత్నాలు సత్ఫలితాలను ఇస్తున్నాయని పేర్కొన్నారు. ఆరెస్సెస్ కులాలకు అతీతమైన సంస్థ అని మోహన్ భగవత్ స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీలపై ఎలాంటి వివక్ష లేదని, అన్ని వర్గాలను ఏకం చేయడమే తమ లక్ష్యమని తెలిపారు. బ్రాహ్మణులు స్థాపించిన సంస్థ అయినప్పటికీ, ఎవరైనా ఆరెస్సెస్ అధ్యక్షుడిగా ఎదగవచ్చని వివరించారు. నిధుల సేకరణపై స్పందిస్తూ, ఆరెస్సెస్ తన కార్యకర్తల నుంచే విరాళాలు సేకరిస్తుందని తెలిపారు. హోటళ్లలో బస చేయకుండా కార్యకర్తల ఇళ్లలోనే ఉంటామని, భోజనానికి డబ్బులు అడగకుండా ఆహారమే కోరుతామని చెప్పారు. తమకు అధికార లాలస లేదని, సమాజాన్ని ఏకం చేయడమే లక్ష్యమని భగవత్ స్పష్టం చేశారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in